



ఏయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

అమలులోకి కేంద్ర నూతన మోటారు వాహన చట్టం

- బైక్ నడిపేవారితోపాటు వెనుక కూర్చొన్న వ్యక్తికి హెల్మెట్ తప్పనిసరి
- కారు నడిపేవారితోపాటు పక్కన కూర్చొనేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాల్సిందే
- ఓవర్‌లోడ్ వాహనాలకు భారీగా జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5,000 జరిమానా
- సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1,500, రెండోసారి పట్టుబడితే రూ.10,000
- కచ్చితంగా 90 రోజుల్లోగా చెల్లించాలని నిబంధన



హెల్మెట్ ధరించని వాహనచోదకుడిని ఆపుతున్న ట్రాఫిక్ పోలీసులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మీరు ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేస్తుంటారా?... వేగంగా వెళ్లాలనే తాపత్రయంలో ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోరా?...ఇకపై అలా చేస్తే మీ జేబు ఖాళీ కావడం ఖాయం. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన మోటారు వాహన చట్టాన్ని ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ప్రకటించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు కొత్త చట్టంలో జరిమానాలను భారీగా పెంచేశారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారికి ముకుతాడు వేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి జరిమానాలు విధిస్తున్నా సరే కొంతమంది వాహన చోదకుల ధోరణి మార్చుకోవడం లేదు. నామమాత్రపు జరిమానాలు విధిస్తుండడంతో నిబంధనలను బేఖాతరు చేసేస్తున్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించేలా కేంద్రం నూతన మోటారు వాహన చట్టం (ఎంవీ యాక్ట్ 2019) రూపొందించింది. నిబంధనలు పాటించని వారికి జరిమానాలను భారీగా పెంచింది. అలాగే విధించిన జరిమానాలను కచ్చితంగా 90 రోజుల్లోగా చెల్లించాలని నిబంధన విధించింది. ఒక తప్పును పదేపదే చేస్తే జరిమానా మొత్తాన్ని మరింత పెంచేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన మోటారు వాహన చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ఈనెల ఒకటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. దీనిని నగర పరిధిలో కూడా అమలు ... మిగతా 6వ పేజీలో

ఉల్లంఘన	ప్రస్తుత జరిమానా	కొత్తచట్టం ప్రకారం..
1. హెల్మెట్ లేకపోతే..	రూ.1,000	రూ.వెయ్యి, రెండోసారి పట్టుబడితే రూ.2000
2. వెనుక కూర్చొన్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే...	రూ.1,000	రూ.2,000
3. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే	రూ.1000	రూ.5,000
4. మైనర్‌లు వాహనం నడిపితే	రూ.500	రూ.5,000
5. డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత లేనివారు వాహనం నడిపితే	రూ.500	రూ.10,000
6. సెల్‌ఫోన్ డ్రైవింగ్	రూ.వెయ్యి	రూ.1,500, రెండోసారి రూ.10,000
7. ఆటో డ్రైవర్ అదనపు చార్జీ డిమాండ్ చేస్తే	రూ.300	రూ.750
8. ఓవర్ స్పీడ్	రూ.400	రూ.1,000
9. డేంజరస్ డ్రైవింగ్	రూ.1,000	రూ.1,500, రెండోసారి రూ.10,000
10. రేసింగ్‌లు చేస్తే	రూ.1,000	రూ.5,000, రెండోసారి రూ.10,000
11. ఇన్సూరెన్స్ లేకపోతే	రూ.1,000	రూ.2,000, రెండోసారి పట్టుబడితే రూ.4,000
12. సీట్ బెల్ట్ పెట్టుకోనట్టయితే	0	రూ.1,000
13. రాంగ్ రూట్, సిగ్నల్ జంప్	రూ.1,000	రూ.2,000
14. ఆటోడ్రైవర్ యూనిఫారం వేసుకోకపోతే...	రూ.150	రూ.300

ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాల్సిందే

- సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖను రోడ్డు ప్రమాద రహిత నగరంగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందే. ఎవరైనా త్వరగా గమ్యం చేరుకోవాలనో...పోలీసులు చూడడం లేదనో సిగ్నల్ జంపింగ్‌లకు పాల్పడినా, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపినా సీసీ కెమెరాలు, పోలీసులు వాడే బాడీవార్న్ కెమెరాల నుంచి తప్పించుకోలేరు. పట్టుబడినవారు కొత్త చట్టం ప్రకారం భారీగా జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఇది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతుంది కాబట్టి అందరూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ వాహనాలను నడపాలి. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గడంతోపాటు వాహన చోదకులకు అనవసర ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

అంకితభావంతో పనిచేస్తా

ఏయూను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యం

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి
- గ్రామీణ ప్రాంతాలకు వర్సిటీ అనుసంధానం
- పరిశ్రమలకు చెందిన నిపుణుల సేవలు వినియోగించుకుంటాం
- కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా లీడర్ షిప్ అకాడమీలు, క్లబ్స్ ఏర్పాటు
- శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు



ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అవినీతికి దూరంగా ఉంటానంటూ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్. చిత్రంలో రెక్టార్ కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఇతర అధికారులు ఉన్నారు

వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు స్వీకరణ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా అంకిత భావంతో పనిచేస్తానని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టిన ఆయన అనంతరం సెనేట్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రతిష్టాత్మక వర్సిటీకి వీసీగా నియమించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు రాజశేఖర్ చెప్పారు. యూనివర్సిటీ వందేళ్ల వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో అనేక సవాళ్లు తన ముందున్నాయన్నారు. వాటిని అధిగమిస్తూ సంస్కరణలు చేపట్టడం ద్వారా వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేస్తానని పేర్కొన్నారు. వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిలపాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ ప్రగతికి కృషిచేస్తానని, ఇందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ... మిగతా 6వ పేజీలో

అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి దూరంగా ఉంటా..

- వీసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రతిజ్ఞ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తన పనితీరు ఎలా ఉండబోతోందో వర్సిటీ వర్గాలకు సంకేతాలను పంపించారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు శాలువాలు తీసుకు రావద్దంటూ ముందే సర్క్యులర్ జారీ చేయించిన ఆయన...బాధ్యతలు స్వీకరణ అనంతరం ప్రతిజ్ఞ కూడా చేశారు. అవినీతి, ఆశ్రితపక్షపాతానికి దూరంగా ఉంటానంటూ ఉద్యోగులు, అధికారుల ముందు ప్రమాణం చేశారు. అంకితభావంతో వర్సిటీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్‌లతో నిర్వహించిన సమావేశంలో కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు.

పెరుగుతున్న విద్యుత్ వాడకం

- ఎండలు మండిపోతుండడమే కారణం
- గత ఏడాది ఫిబ్రవరిలో సగటు వినియోగం 440 మిలియన్ యూనిట్లు
- ఈ ఫిబ్రవరిలో 660 మిలియన్ యూనిట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి ఇంకా ప్రారంభం కాకముందే ఎండలు గట్టిగా కాస్తున్నాయి. ఫిబ్రవరి నెలలోనే 36.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సముద్ర తీర ప్రాంతం కావడంతో వేడి కాసింత అధికంగానే ఉంటోంది. వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంతా ఫ్యాన్లు, ఏసీలు విస్తృతంగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం డిమాండ్‌కు మించి పెరిగింది.

గత ఏడాది (2024) ఫిబ్రవరిలో సగటు విద్యుత్ వినియోగం రోజుకు 440 మిలియన్ యూనిట్లు కాగా ఆ ఏడాది 28వ తేదీన అత్యధికంగా 485 మి.యూనిట్లు వాడారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చూసుకుంటే సగటు వినియోగం రోజుకు 660 మి.యూనిట్లకు పెరిగింది. అత్యల్పంగా రెండో తేదీన 624 మి.యూనిట్లు వినియోగించగా, అత్యధికంగా 25వ తేదీన 712 మి.యూనిట్లు వాడేశారు. రాత్రి ఏడు గంటల సమయంలో విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది.

పది లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు

మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో నివసిస్తున్న జనాభా 23 ... మిగతా 6వ పేజీలో

విద్యుత్ వినియోగం
రాత్రి 7 గంటల సమయంలో


	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
1వ తేదీ	421 మి.యూ.	662 మి.యూ.
7వ తేదీ	471 మి.యూ.	678 మి.యూ.
13వ తేదీ	428 మి.యూ.	699 మి.యూ.
17వ తేదీ	432 మి.యూ.	667 మి.యూ.
22వ తేదీ	446 మి.యూ.	672 మి.యూ.
25వ తేదీ	435 మి.యూ	712 మి.యూ.
28వ తేదీ	485 మి.యూ.	672 మి.యూ.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.06
సహరి (సోమ)	4.57

ఆహారం... ఆరోగ్యం

ప్రజల జీవన విధానంలో మార్పులు



- వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్ వినియోగం
- రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటితో చేసిన ఆహారానికి ప్రాధాన్యం
- సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, పంటలకు పెరుగుతున్న డిమాండ్
- షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారం తీసుకోవడమే మంచిదంటున్న వైద్యులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవనశైలి, ఆహారపు అలవాట్లపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అందుకే ప్రస్తుతం చాలా మంది అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకూ చిరుధాన్యాలతో చేసిన వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఉదయాన్నే పూరీ, వడ వంటివి తీసుకోవడం వల్ల బద్ధకంగా ఉంటుంది. చిన్న వయసులోనే ఊబకాయం వచ్చేందుకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది మిల్లెట్ డైట్‌కు మళ్లుతున్నారు. ఉదయాన్నే రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలతో చేసిన ఇడ్లీ, ... మిగతా 6వ పేజీలో

గ్లైసెమిక్ ఇండెక్స్ అంటే?

గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) అనేది ఆహారంలో ఉండే వివిధ రకాల కార్బోహైడ్రేట్లకు శరీరం ఎంత త్వరగా స్పందిస్తుందో కొలిచేందుకు సహాయపడే సాధనంగా చెప్పవచ్చు. జీఐ 55లోపు ఉంటే తక్కువగా, 55 నుంచి 69 మధ్య ఉంటే మధ్యస్థంగా, 70 దాటి ఉంటే ఎక్కువగా ఉన్నట్టు చెబుతారు. జీఐ అధికంగా ఉండే ఆహార పదార్థాలు విషయానికి వస్తే.. తెల్ల బియ్యం, పుచ్చకాయ, చిలగడదుంప, కాల్చిన బంగాళాదుంప, తెల్ల రొట్టె, జెల్లీ బీన్స్ వంటి వాటిల్లో 70కు పైబడి ఉంటుంది. ఎండు ద్రాక్ష, పైనాపిల్, మొక్కజొన్న, టేబుల్ షుగర్, బ్రౌన్ రైస్ వంటి వాటిల్లో 56 నుంచి 69 మధ్య ఉంటుంది తక్కువ జీఐ ఉండే ఆహార పదార్థాల్లో కాయధాన్యాలు, సహజ పెరుగు, కాల్చిన బీన్స్, స్కిమ్డ్ మిల్క్, క్యారెట్, తృణ ధాన్యాలతో చేసిన రొట్టెలు ఉంటాయి.

తక్కువ జీఐ ఉండే పండ్లు: యాపిల్స్, ద్రాక్ష, స్ట్రాబెర్రీస్, చెర్రీస్, కమలాలు

ఆహారం: ఓట్స్, ఆలివ్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్, క్వినోవా, పాలు, బాదం, వాల్ నట్స్, కాయ ధాన్యాలు,

కాయగూరలు: కారెట్, బ్రకోలీ, టమాటా, కాలీఫ్లవర్

తక్కువ జీఐ ఉన్నవి తీసుకుంటే బ్లడ్ షుగర్స్, కొలెస్ట్రాల్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. ఊబకాయం వచ్చే అవకాశం ఉండదు. గుండె జబ్బులకూ దూరంగా ఉండవచ్చు.



కృష్ణా కళాశాల పరీక్షా కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 95 శాతం మంది హాజరు

మద్దిలపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం జిల్లాలోని 87 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. పరీక్షకు 95 శాతం మంది హాజరయ్యారు. జనరల్ కోర్సుల నుంచి 41,945 మందికి 40 వేల మంది పరీక్షలు రాయగా, 1,945 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల నుంచి 1,741 విద్యార్థులకు గాను 1,634 మంది పరీక్షలు రాయగా, 107 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండడంతో విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. 8.30 గంటలకు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. సెల్‌ఫోన్లు, డిజిటల్ పరికరాలు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎస్, డీఏ, కస్టోడియన్లు ఉదయం 8.30 గంటలకు పోలీస్ స్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలను తీసుకొచ్చి ఇన్విజిలేటర్లకు అందించారు. పరీక్షలు ప్రారంభమయ్యాక సీసీ కెమెరాల ద్వారా ఆర్ఐవో కార్యాలయంలో సిబ్బంది పర్యవేక్షించారు. కస్టోడియన్లు సిట్టింగ్ స్క్వాడ్ కింద విధులు నిర్వహించారు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు పరీక్షాకేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి.

సిటీలో కో వర్కింగ్ స్పేస్

- చిన్నపాటి ఐటీ కంపెనీలకు తగిన వసతి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- కన్సల్టెన్సీలతో సమావేశం
- నగరంలో పది నుంచి 12 ప్రైవేటు భవనాలు గుర్తించిన అధికారులు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐటీ కంపెనీలకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో 'స్పేస్' సమకూర్చే ఏర్పాట్లలో ప్రభుత్వం నిమగ్నమైంది. చిన్న కంపెనీలకు స్పేస్ సమకూర్చేందుకు మూడు నుంచి నాలుగు ఐటీ కన్సల్టెన్సీ కంపెనీలు ముందుకువచ్చాయి. చిన్న కంపెనీలకు సొంతంగా భవనాలు సమకూర్చుకునేంత ఆర్థిక వెసులుబాటు ఉండదు. ఇటువంటి కంపెనీలకు 'కో వర్కింగ్ స్పేస్' విధానంలో సదుపాయాలు సమకూర్చే ఐటీ కన్సల్టెన్సీ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌తో సమావేశం అయ్యాయి. ఈ నేపథ్యంలో విశాఖ నగరంలో ఐటీ సేవల నిర్వహణకు అనువుగా ప్రైవేటు భవనాలు గుర్తించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చాయి. ఐటీ కంపెనీలకు రెండున్నర నుంచి మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వసతి అవసరమన్న ప్రభుత్వం సూచన మేరకు అధికారులు పది నుంచి ప్రైవేటు భవనాలను పరిశీలించారు. మురళీనగర్ జంక్షన్‌లోని బొత్స స్క్వేర్, వీఐపీ రోడ్డులోని ఓ బిల్డింగ్, పాత జైలు రోడ్డు వద్ద గతంలో ఐటీ కంపెనీ నడిచిన భవనం, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, తదితర ప్రాంతాల్లో భవనాలను పరిశీలించారు. చదరపు అడుగుకు రూ.50 నుంచి రూ.60 అద్దె కలిగిన భవనాల వైపు ఐటీ కంపెనీలు మొగ్గుచూపే అవకాశం ఉంది. నగరంలో భవనాలపై అధికారులు ఒక నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. గుర్తించిన భవనాలను ఐటీ కన్సల్టెన్సీ సర్వీస్‌లు అందించే కంపెనీలు పరిశీలించాయి. త్వరలో ఆయా భవనాల యజమానులతో ఐటీ కన్సల్టెన్సీ కంపెనీలు ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. ఆ తరువాత చిన్న కంపెనీలు వచ్చి ఐటీ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఐటీ కంపెనీల కోసం వీఐపీ రోడ్‌లో అధికారులు గుర్తించిన భవనం

కో వర్కింగ్ స్పేస్...అంటే

చిన్న కంపెనీకి రెండు వేల చదరపు అడుగుల స్పేస్ అవసరమనుకుంటే అందుకు తగిన ఫర్నీచర్, విద్యుత్, ఏసీ సదుపాయం కల్పించే బాధ్యత కన్సల్టెన్సీ ... మిగతా 6వ పేజీలో

95.49% మందికి పింఛన్ల పంపిణీ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ 95.49 శాతం మేర పూర్తిచేశారు. మొత్తం 1,52,879 మందికి రూ.66.37 కోట్లను అందజేశారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 25,474 (96.18 శాతం) మందికి రూ.10.67 కోట్లు, జీవీఎంసీ పరిధిలో 1,27,405 మందికి (95.4 శాతం) రూ.55.7 కోట్లు పంపిణీ చేశారు. ఉదయం ఏడు గంటల తరువాత యాప్ అందుబాటులోకి రావడంతో సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి సొమ్ము పంపిణీ చేశారు. మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో అందజేయాలని ఆదేశాలు వచ్చాయి.

విశాఖ యువతకు నాస్కామ్ ప్రైమ్ కెరీర్ ఫెయిర్ సువర్ణావకాశం

» ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో మార్చి 5, 6 తేదీల్లో జరిగే నాస్కామ్ ప్రైమ్ కెరీర్ ఫెయిర్ విశాఖ యువతకు సువర్ణావకాశమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. నాస్కామ్ ప్రైమ్ కెరీర్‌ఫెయిర్ నిర్వాహకులు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాస్కామ్ ప్రైమ్ కెరీర్‌ఫేర్ 10 వేలకు పైగా ఉద్యోగావకాశాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. 2024-25లో టెక్నాలజీ, ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్స్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఈ జాబ్‌మేళా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విశాఖపట్నం విద్య, పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, ఈ తరహా కార్యక్రమాలు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా నగర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని ఎంపీ పేర్కొన్నారు. అభ్యర్థులు మార్చి 3వ తేదీలోగా వెబ్‌సైట్‌లో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు రుషికొండ గీతం డీమ్డ్ యూనివర్సిటీలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. నిర్వాహకులు నాస్కామ్ ప్రైమ్‌కెరీర్ గురించి వివరిస్తూ విప్రో, టీసీఎస్, టెక్ మహీంద్రా, జెన్‌ప్యాక్ట్, కాంసెంట్రిక్స్, యాక్సిస్ వంటి ప్రముఖ కంపెనీలు ఈకెరీర్ ఫెయిర్‌లో పాల్గొననున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమం ఫస్ట్‌కం, ఫస్ట్‌సర్వ్ విధానంలో కొనసాగుతుందన్నారు. ఈకెరీర్ ఫెయిర్ ద్వారా అభ్యర్థులు పరిశ్రమ ప్రముఖులతో ప్రత్యక్షంగా కలుసుకుని తమ కెరీర్ అవకాశాలను తెలుసుకోవడంతో పాటు ఉద్యోగావకాశాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈనాస్కామ్ ప్రైమ్ కెరీర్ ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని, వారి జీవిత లక్ష్యాలను సాకారం చేసుకునే మార్గాన్ని అందిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు ఇస్కాన్‌లో అంతర్జాతీయ నాటకప్రదర్శన

సాగర్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వామనదేవుని అవతారంపై అంతర్జాతీయ నాటక ప్రదర్శన ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ప్రదర్శించనున్నట్టు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు ఒక ప్రకటనలో వెల్లడించారు. దక్షిణాఫ్రికా,కెనడా, యూఎస్‌ఏ నుంచి విచ్చేసిన ప్రతిభావంతులైన భక్తబృందం, కళాకారులు ప్రదర్శనలో పాల్గొననున్నట్టు తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు స్పందన భేష్



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమునిపట్నం,మార్చి 1(ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో శనివారం ఒమెగా హాస్పిటల్స్ నిర్వాహకులు చేపట్టిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు మంచి స్పందన వచ్చింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ యువనేత రవితేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలు, పురుషులకు బీపీ, షుగర్, నేత్ర పరీక్షలను కూడా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 81 మంది పలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు టీడీపీ నాయకులు యార్లగడ్డ జీవన్‌కుమార్, గంటా నూకరాజు, జి.నరేంద్రకుమార్, జి.అప్పలనాయుడు, పి.నరసింగరావు, కె.కృష్ణ, వై.అనిల్‌ప్రసాద్, పి.సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం సబ్ రిజిస్ట్రార్‌గా కశిరెడ్డి బాలాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నక్కా ఆనంద్‌కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో డీఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న బాలాజీని ఆయన స్థానంలో నియమించారు.

రామాలయ పునఃప్రారంభం

భీమునిపట్నం,మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇక్కడి నూకాలమ్మ గుడివీధిలో ఉన్న పురాతన ఆది ఆంధ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ మందిరం శిథిల స్థితికి చేరడంతో పునర్నిర్మించారు. శనివారం పునఃప్రారంభించారు.

సిటీలో కో వర్కింగ్ స్పేస్

... 5వ పేజీ తరువాయి

కంపెనీ తీసుకుంటుంది. కొన్ని కంపెనీలు పది మంది, 15 లేదా 20 మందితో కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. వారంతా కూర్చునేందుకు కుర్చీలు, మీటింగ్ హాల్ మాత్రమే కావాలి. ఒక భవనంలో పది నుంచి 20 చిన్న కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. బెంగళూరు, హైదరాబాద్, ముంబై, నోయిడాల్లో కొద్దిపాటి స్పేస్ తీసుకుని కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలు ఎక్కువగా ఉంటాయని ఐటీ నిపుణుడొకరు తెలిపారు.

జూనియర్ కళాశాల వద్ద ఇంటర్ పరీక్షల సందడి



పరీక్షకు కేటాయించిన గదులను చూసుకొంటున్న విద్యార్థినులు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ జూనియరు కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకే పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు చేరుకున్నారు. ఉదయం 8:30 గంటలకు పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.మూర్తి పర్యవేక్షణలో మధ్యాహ్నం 1 గంట వరకూ తెలుగు, సంస్కృతం పరీక్ష, ఒకేషనల్ గ్రూప్స్‌లో జనరల్ ఫౌండేషన్ కోర్సులకు సంబంధించి పరీక్ష జరిగింది. తెలుగు, సంస్కృతం అభ్యర్థులు మొత్తం 311 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు. 305 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే, వొకేషనల్స్ గ్రూప్స్‌లో మొత్తం 237 మందికి 17 మంది గైర్హాజరవగా, 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 548 మందికి 23 మంది గైర్హాజరవగా, 525 మంది విద్యార్థులు జనరల్, వొకేషనల్ కోర్సుల్లో పరీక్షకు హాజరయ్యారని ఆర్.మూర్తి తెలిపారు.

ఈ పరీక్షలకు డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా అప్పారావు వ్యవహరించారు. పరీక్షకేంద్రం వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు, ప్రాథమిక వైద్యం, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.

చీఫ్ సూపరింటెండెంట్ చొరవతో దివ్యాంగ విద్యార్థికి అవకాశం

కాగా, పద్మనాభం మండలం కోరాడ పంచాయతీ గెద్దపేట గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడు సుంకరి రవితేజ తగరపువలస లో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. అవగాహన లేకపోవడంతో నేరుగా హాల్ టిక్కెట్‌తో భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని అతడి తండ్రి ఆటోడ్రైవర్ అప్పలరాము తీసుకొని వచ్చారు. అయితే, ఇటువంటి విద్యార్థులకు స్క్రైబర్‌ను ప్రభుత్వం అనుమతి ఇస్తోంది. దానికి నగరంలో మద్దిపాలెంలో ఉన్న ఆర్‌ఐవో కార్యాలయంలో జిల్లా పరీక్షల కమిటీ (డెక్)కు దరఖాస్తు చేసుకోవాలి. ఆ కమిటీ అనుమ ఇస్తుంది.

అప్పటికప్పుడు పరిస్థితిని ఆర్‌ఐవో కార్యాలయంలో డెక్‌తో ఈ కేంద్రం చీఫ్ సూపరింటెండ్ ఆర్.మూర్తి వివరించారు. డెక్ అధికారుల అనుమతిలో పరీక్ష రాయడానికి రవితేజకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం ఆర్‌ఐవో కార్యాలయానికి వెళ్లి అనుమతి పత్రం పొందాలని సూచించారు. మొత్తానికి రవితేజకు పరీక్షకు అనుమతి లభించడంతో అంతా సంతోషించారు.

భవన నిర్మాణ కూలి అదృశ్యంపై ఫిర్యాదు



భీమునిపట్నం (రూరల్) మార్చి 01 (ఆంధ్రజ్యోతి) : భీమిలిమండలం తాళ్లవలసలో నిర్మాణంలో ఉన్న కళాశాల నిర్మాణ పనుల నిమిత్తం శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన కాగితాల దానయ్య (40) కనిపించడం లేదంటూ భీమిలి పోలీసులకు పిర్యాదు అందింది.సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సుధాకర్ అందించిన వివరా లిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం హజారాం గ్రామానికి చెందిన దానయ్య గత ఆరు నెలల కాలంగా తాళ్లవలసలో నిర్మాణంలో ఉన్న కళాశాల భవంతిలో కూలీగా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇతర కూలీలతో ఇతడికి గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో గతనెల 25 నుంచి కనిపించకుండా పోయాడని అతడి మేనమామ అలబాన హరికృష్ణ శ్రీకాకుళం నుంచి భీమిలి వచ్చి శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు. తెలిసిన వారి అందరిని కనుక్కున్నా ఇతని ఆచూకీ తెలియలేదని దానయ్య అదృ శ్యం వెనుక అనుమానాలు ఉన్నాయంటూ పిర్యాదులో పేర్కొన్నారు. భీమిలి ఏఎస్ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక నేత బాబూరావుకు కన్నీటి వీడ్కోలు




బాబూరావు అంతిమ యాత్రలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

తగరపువలస, మార్చి 01 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన కార్మిక నాయకుడు అల్లు బాబూరావుకు శనివారం చిట్టివలసలో కార్మిక సంఘాలకు చెందిన నాయకులు అంతిమ వీడ్కోలు పలికారు. వివిధ సంఘాలకు చెందిన నేతలు బాబూరావు పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో పాల్గొని 'బాబూరావు అమర్ రహే..' అంటూ నినాదాలు చేశారు. ఏఐటీయూసీ నాయకులు పడాల రమణ, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, సీపీఐ నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, మరుపల్లి పైడిరాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, సీఐటీయూ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, టీఎన్‌టీయూసీ నాయకులు అచ్చారావు, రామారావు, దేముళ్లు తదితర నాయకులు నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రణాళికల రూపకల్పనలో సిద్ధహస్తుడు శ్రీరాముడు

» ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తన వద్దకు వచ్చి శరణు కోరిన వారిని రాముడు కాపాడతాడని, ఏదైనా సాధించడానికి ప్రణాళికలను రూపొందించడతో శ్రీరాముడు సిద్ధహస్తుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఇక్కడి గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా యుద్ధకాండలోని పలు అంశాలను ఆయన శనివారం వివరించారు. సీతమ్మ జాడ తెలిపి రామాయణ మహాకావ్యాన్ని మలుపు తిప్పిన హనుమంతుడిని ప్రత్యుపకారం చేయలేనని హనుమాన్‌ను శ్రీరాముడు ఆలింగనం చేసుకున్న ఘట్టం గురించి తెలిపారు. అలాగే రావణుడితో సాగిన యుద్ధంలో రాముడు విజయం సాధించడం, యుద్ధంలో అవాంతరాలను ఎలా అధిగమించాలి, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్యసోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

14న సింహాద్రి అప్పన్న స్వామి డోలోత్సవం

సింహాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 14న సింహాద్రి అప్పన్న స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం (చూర్ణోత్సవం) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 14వ తేదీ ఉదయం ఆరున్నరకు మెట్ల మార్గం ద్వారా కొండదిగువ పుష్కరిణి సత్రం వద్ద గల ఉద్యానవన మండపానికి స్వామివారు విచ్చేశాక ఉత్సవాలను నిర్వహిస్తారు. అనంతరం గ్రామ తిరువీధోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే స్వామి వారి నిత్య కల్యాణాన్ని 14వ తేదీన రద్దు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

సింహాచలేశునికి నెలవారి పూజలు

వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈ నెల 2, 6 తేదీల్లో స్వర్ణపుష్పార్చన, 7న తాయార్ల సన్నిధిని సహస్రనామార్చన, తాయార్ల బేడా తిరువీధి నిర్వహించనున్నారు. అలాగే దే 8న ఆర్థశ్రీఎంబెరు మానార్ మాస తిరునక్షత్రం, 9న స్వర్ణ పుష్పార్చన, వార్షిక తిరుమహోత్సవం, 10న స్వర్ణ తులసీదళార్చన, సీతారామస్వామి వారి వార్షిక తిరుకల్యాణోత్సవం, 12న సీతారామస్వామి సదస్యం, 13న స్వర్ణ పుష్పార్చన, 14న శ్రీతాయార్ల సన్నిధిలో సహస్రనామార్చన, 15న సీతారామస్వామికి పుష్పయాగం, 16న స్వర్ణ పుష్పార్చన, 18న స్వామి హోమం, 19న శీనమ్మాళ్వార్ మాస తిరునక్షత్రం, 20న స్వర్ణ పుష్పార్చన జరుపుతారు. అదేవిధంగా 21వ తేదీన తాయార్ల సన్నిధిలో సహస్రనామార్చన, శ్రీతాయార్ల బేడా తిరువీధి, 22న మహామునుల మాస తిరునక్షత్రం, 23న స్వర్ణ పుష్పార్చన, 25న స్వర్ణ తులసీదళార్చన, 27న స్వర్ణ పుష్పార్చన, 28న తాయార్ల బేడా తిరువీధి, 29న గ్రామ బలిహరణం, గ్రామ తిరువీధి, 30న స్వర్ణ పుష్పార్చన, ఉగాది పూజలు, తిరు కల్యాణోత్సవం, తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 'అవంతి' విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం (రూరల్)/తగరపువలస, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో అవంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బీఎస్సీలో ఎన్.అలేఖ్య 9.83 పాయింట్లు సాధించి నగరంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణ తెలిపారు. అలాగే డి.ధనలక్ష్మి 9.40 పాయింట్లు, కె.చాందిని 9.37, పి.భవానీ 9.33, కె.మిత్ర 9.30, మనీషా 9.27, ఎస్.రుచిత 9.23, జీరు సుమ 9.10, కె.రాము 9.07 పాయింట్లు సాధించారన్నారు. అలాగే బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పి.భవ్య, టి.తేజస్విని 8.50 పాయింట్లు సాధించారన్నారు. వీరికి కళాశాల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

అలాగే తగరపువలస కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థినులు డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించారని కాలేజీ ఛైర్మన్ బి.నరసింగరావు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ఎన్.హరిప్రియ 10కి 9.70 పాయింట్లు సాధించి భీమిలి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే 14 మందికి 9 పాయింట్లకు పైగా, 50 మందికి 8 పాయింట్లకు పైబడి వచ్చినట్టు పేర్కొన్నారు.


మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

ఐసీడీఎస్ పీవో రత్నం

ఆనందపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఐసీడీఎస్ పీవో బోధ రత్నం అన్నారు. మండలంలోని వేములవలస గ్రామ సచివాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించి బేటీ బచావో.. బేటీ పడావో, పెళ్లికి ఎందుకు తొందర-చదువుకే ముందర, బాలిక చదువు-ఇంటికి వెలుగు అంటూ బాల్య వివాహాలను అరికట్టాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విపత్తు రక్షణపై మరింత శిక్షణ పొందాలి

పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

కొమ్మాది, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు ఆస్తి, ధన నష్టం వాటిల్లకుండా విధులెలా నిర్వర్తించాలో మరింతగా ప్రాక్టీస్ చేయాలని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. బక్కన్నపాలెంలోని 16వ పోలీస్ బెటాలియన్‌లో డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ 45వ బ్యాచ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతినెలా మొదటి, రెండో వారంలో జరిగే డిజాస్టర్ రెస్క్యూ ట్రైనింగ్‌లో మరింత తర్ఫీదు పొందాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా తమను తాము శారీరకంగా, మానసికంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు అడిషనల్ కమాండెంట్ వి.నారాయణరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఇళయసాగర్, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



6 నుంచి ఎల్లమ్మ జాతర

భీమునిపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో ఎల్లమ్మ జాతరను ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు వెరుపండా శేఖర్ తెలిపారు. 6వ తేదీ రాత్రి తొలేళ్ల ఉత్సవం, 7వ తేదీ సాయంత్రం అనుపోత్సవం, 9న అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. తొలేళ్లు, అనుపోత్సవాల రోజుల్లో పలు రకాల వేషాలు ఉంటాయన్నారు. అమ్మవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వాడకం

... 5వ పేజీ తరువాయి

లక్షలు. ఈపీడీసీఎల్ కనెక్షన్లు సుమారు 10,03,794 వరకూ ఉన్నాయి అందులో గృహాలతో పాటు పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, రహదారుల పక్కన దుకాణాలు ఉన్నాయి. కనెక్షన్లు, ఆ మేరకు విద్యుత్ డిమాండ్, లోడు ఏటా పెరుగుతున్నాయి. 2024 ఫిబ్రవరితో పోల్చుకుంటే ఈ ఏడాది అదనంగా 220 మి.యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది.

డిమాండ్‌కు తగినట్టుగా సరఫరా..

- శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖ సర్కిల్

పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, వాటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా చేస్తున్నాము. వేసవి ఇంకా ముందుంది. ఎంత అవసరమైనా కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం.

అంకితభావంతో పనిచేస్తా

... 5వ పేజీ తరువాయి

విజన్-2047కు వర్సిటీ కూడా తన వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు. ఎంతోమంది మహనీయుల స్ఫూర్తి, కృషి ఫలితంగా వర్సిటీ ఉన్నత స్థానంలో నిలిచిందని, దీనిని ముందుకు తీసుకువెళతామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా కరిక్యులమ్‌కు రూపకల్పన చేస్తామన్నారు. కేంద్రీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ వనరులు, నిధులు పెంపొందించుకునేందుకు కృషిచేస్తామని వివరించారు. ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ఉన్న వనరులతోనే అత్యుత్తమ ఫలితాలను అందించేందుకు కృషిచేస్తామని స్పష్టంచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే దిశగా నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్న సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టంచేశారు. వర్సిటీకి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా లీడర్ షిప్ అకాడమీలు, క్లబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇండస్ట్రీ, అకాడమీ మధ్య పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు అనుగుణంగా పరి శ్రమలకు చెందిన నిపుణుల సేవలను వినియోగించుకుంటామన్నారు. వర్సిటీలో ఫ్యాకల్టీ సమస్య ప్రధానంగా ఉందని, ప్రభుత్వ సహకారంతో ఈ సమస్యను అధిగమిస్తామని స్పష్టంచేశారు.

మహనీయులకు నివాళులు

బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ముందుగా ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపటారు.కార్యక్రమంలో రెక్టార్ కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్లు, ఇతర అధికారులతో ఆయన అకడమిక్‌సెనేట్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ ప్రక్రియకు ముందు ఎవరూ పూల బొకేలు, శాలువాలు, బహుమతులుతీసుకురావద్దంటూ ముందుగానే సర్క్యులర్‌ను పంపించా రు. అనంతరం సెనేట్ హాలులో వివిధ విభాగాల నుంచి వచ్చిన ఫ్యాకల్టీ, సిబ్బందితో పరిచయ కార్య క్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చాక్లెట్‌ఇచ్చి వారి వివరాలను తెలుసుకున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ప్రకటించారు. నూతన చట్టం ప్రకారం ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చొనే వ్యక్తి (పలియన్ రైడర్) కూడా విధిగా హెల్మెట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. వాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోతే ఇప్పటివరకు రూ.వెయ్యి జరిమానా విధించగా, ఇకపై కూడా రూ.వెయ్యి మాత్రమే విధిస్తారు. రెండోసారి పట్టుబడితే మాత్రం రూ.రెండు వేలు చెల్లించాల్సి ఉంటుంది. బైక్ వెనుక కూర్చొనే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోనట్టయితే దానికి కూడా రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి అదే వ్యక్తి ఎక్కడైనా పట్టుబడితే మాత్రం రూ.రెండు వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు కట్టాల్సి ఉటుంది. 18 ఏళ్లలోపు వారు (మైనర్‌లు) వాహనం నడిపితే ఇప్పటివరకు రూ.500 జరిమానా విధించగా...ఇకపై రూ.ఐదు వేలకు పెంచారు. 18 ఏళ్లు దాటినా వేర్వేరు కారణాల చేత డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత లేనివారు వాహనం నడుపుతూ పట్టుబడితే ప్రస్తుతం విధిస్తున్న రూ.500 జరిమానాను రూ.పది వేలకు పెంచారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తుండగా, ఇకపై రూ.1,500 కట్టాల్సి ఉంటుంది. ఒకవేళ రెండోసారి పట్టుబడితే రూ.పది వేలు కట్టాల్సి ఉంటుంది. ఆటో డ్రైవర్లు యూనిఫారం లేకుండా పట్టుబడితే ఇంతవరకూ రూ.150 జరిమానా విధించగా, ఇకపై రూ.300 విధిస్తారు. అలాగే ఆటో ప్రయాణికుల నుంచి అదనపు చార్జీ డిమాండ్ చేస్తే వారికి రూ.750 జరిమానా విధించనున్నారు. వాహనాన్ని అపరిమితవేగంగా నడిపితే ప్రస్తుతం రూ.400 జరిమానా విధిస్తుండగా ఇకపై రూ.వెయ్యి విధించనున్నారు. ప్రమాదకరంగా వాహనం నడిపినవారికి ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తుండగా, ఇకపై రూ.1,500 విధించనున్నారు. రెండోసారి పట్టుబడితే రూ.పది వేలు కట్టాల్సి ఉంటుంది. బైక్ రేసింగ్‌లకు పాల్పడేవారికి ప్రస్తుతం విధిస్తున్న రూ..వెయ్యి జరిమానాను రూ.ఐదు వేలకు పెంచారు. రెండోసారి పట్టుబడితే వారికి రూ.పది వేలు జరిమానా విధిస్తారు. రవాణా వాహనాలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే ఇంతవరకు రూ.వెయ్యి జరిమానా చెల్లించగా, ఇకపై రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి అదనపు టన్నుకి రూ.రెండు వేలు చొప్పున అదనంగా చెల్లించాలి. 108తోపాటు ఇతర అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా ఆటంకం కలిగిసతే ఇకపై రూ.పది వేలు జరిమానా విధించనున్నారు. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే ఇంతవరకు రూ.వెయ్యి వసూలుచేయగా, ఇకపై రూ.రెండు వేలు కట్టాల్సి ఉంటుంది. రెండోసారి పట్టుబడితే రూ.4 వేలు జరిమానా చెల్లించాలి. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సిగ్నల్ జంపింగ్ చేయడం వంటి ఉల్లంఘనలకు ఇకపై రూ.వెయ్యి కాకుండా రెండు వేల రూపాయలు జరిమానా కింద వసూలు చేయనున్నారు.

ఆహారం... ఆరోగ్యం

... 5వ పేజీ తరువాయి

దోసెలు, కిచెడీ, ఉప్మా వంటివి తింటున్నారు.

భోజనంలో మార్పులు

గ్లైసెమిక్ ఇండెక్స్ అధికంగా ఉండడంతో చాలామంది వైట్‌రైస్‌కు దూరంగా ఉంటున్నారు. వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్, ఓట్స్, కొర్రలు, సామలు, అరికలతో తయారుచేసిన ఆహార పదార్థాలకు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే తెల్లని రైస్ పండిస్తున్నారు. తెల్లని రైస్‌కు అలవాటు పడినవాళ్లు వాటిని తెప్పించుకుని తింటున్నారు.

ఆరోగ్యానికి మేలు

చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి వాటితో చేసిన ఆహార పదార్థాలు బీపీ, థైరాయిడ్, ఊబకాయం, కంటి సమస్యలు, పీసీవోడీ, అండాశయం ఇబ్బందులు, డయాబెటిస్, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడే వారికి ఎంతగానో మేలు చేస్తాయని చెబుతున్నారు. షుగర్, ఊబకాయం వంటి సమస్యలకు గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడమే కారణంగా వైద్యులు చెబుతున్నారు. తృణధాన్యాల్లో జీఐ తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ వంటివి దరిచేరవని నిపుణులు చెబుతున్నారు. అలాగే, తృణ ధాన్యాల్లో అధికంగా ఉండే ప్రొటీన్లు కండరాల సామర్థ్యానికి దోహదం చేస్తాయి.

సేంద్రీయ పంటల వైపు మొగ్గు..

మరోవైపు రసాయనాలు వినియోగించకుండా పండించిన కూరగాయలు, పంటల వైపు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటి ధర కాస్త అధికంగా ఉన్నప్పటికీ వెనక్కి తగ్గడం లేదు. ఎంతో మంది మేడపైనే తమకు కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలను సేంద్రీయ పద్ధతుల్లో పండించుకుంటున్నారు. మరోవైపు మార్కెట్‌లో లభించే ఆయిల్ కంటే గానుగ నూనెలు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. దేశీవాళీ ఆవు పాలకు, నెయ్యికి కూడా డిమాండ్ పెరుగుతోంది.

ఆహారపు అలవాట్లలో మార్పులతోనే సమస్యలు

- డాక్టర్ ఆర్.వాసుదేవ్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు

అనేక అనారోగ్య సమస్యలకు ఆహారపు అలవాట్లే కారణం. కొంతమంది ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు జంక్ ఫుడ్, బయట ఫుడ్ తింటుంటారు. వారికి చిన్న వయసులోనే జీర్ణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో పూర్వ ఆహార పద్ధతుల వైపు చాలామంది వెళుతున్నారు. చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా షుగర్, బీపీ వంటి సమస్యలతో బాధపడే వారికి మిల్లెట్స్‌తో చేసిన ఆహారం కొంత మేలు చేస్తుంది. వైట్ రైస్‌లో కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి. దీనివల్ల షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. కాబట్టి, వీరంతా బ్రౌన్ రైస్, మిల్లెట్స్ చేసిన ఆహారాన్ని అలవాటు చేసుకుంటున్నారు.

బ్యాలెన్స్‌డ్ డైట్ అత్యంత కీలకం

- డాక్టర్ ఆర్.రేఖ, పోషకాహార నిపుణులు, ఏయూ

మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని కూడా పరిధి మేరకు తీసుకోవాలి. ఏవి తీసుకున్నా బ్యాలెన్స్ డైట్ అత్యంత కీలకం. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా విటమిన్లు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి. షుగర్, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మిల్లెట్స్‌తో చేసిన ఆహారం మంచిది. వీటి వినియోగం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

14న వరాహలక్ష్మీనరసింహ స్వామి డోలోత్సవం

సింహాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 14న శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి వారికి డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న ఉదయం 6.30 గంటలకు మెట్ల మార్గం ద్వారా కొండదిగువ పుష్కరిణి సత్రం నందు గల ఉద్యానవన మండపానికి శ్రీస్వామివారు విచ్చేసిన తరువాత ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామ తిరువీధోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఆలయంలో జరిగే స్వామి నిత్యకళ్యాణం ఈ నెల 14న రద్దు చేయనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పని తీరు మెరుగుపరచుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు

సచివాలయ సిబ్బందికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక

ఆరిలోవ, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : పని తీరు మెరుగు పరుచుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని సచివాలయ ఉద్యోగులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. ఆయన శనివారం ఉదయం విశాలాక్షినగర్ పరిధిలోని దయాళ్‌నగర్‌లో1, 2 సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు అక్కడే ఉన్న కలెక్టర్ వివిధ అంశాలు, సేవలు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటిస్తున్నారా? లేదా? విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అనే అంశాలపై ఆరా తీశారు. హాజరు పట్టీలు, ప్రగతినివేదికలను పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న వినతులను సకాలంలో పరిష్కారం చూపుతున్నారా అనే కోణంలో సూక్ష్మ స్థాయి పరిశీలన చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణలో ఎలాంటిచర్యలు తీసుకున్నారు అంటూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరి లాగిన్ ఓపెన్ చేయించి పెండింగ్‌లో ఉన్న వినతులను కలెక్టర్ పరిశీలించారు. జాబ్‌చార్ట్ ఆధారంగా ప్రతి ఒక్కరూ పని చేస్తున్నారా లేదా అని ఆరా తీసారు. తనిఖీల్లో భాగంగా వివిధ అంశాలపై సచివాలయ ఉద్యోగులు వెనుక బడి ఉండటాన్ని నిర్లక్ష్య ధోరణిని గుర్తించిన కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేసారు. అన్ని సదుపాయలు కల్పించినప్పటికీ ప్రజలకు సేవలు అందించడంతో ఎందుకు వెనకబడి ఉన్నారని అగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడాలని, సేవలను మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ సమయం పాలన పాటించాలని, సచివాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను అడిగి తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని హితవు పలికారు, ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టడంలో ఉత్సాహం చూపించాలని ఉత్తమ ఫలితాలను ప్రసాదించాలని పేర్కొన్నారు.ఎంఎ

పిల్లల మనసెరిగి మెలగాలి

- తల్లిదండ్రులకు సీపీ శంఖబ్రత బాగ్చి సూచన
- ఘనంగా డివైన్ టచ్ పాఠశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

సిరిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మనస్తత్వాన్ని తల్లిదండ్రుల గ్రహించి వారికి ఇష్టమైన రంగాల్లోని రాణించేలా కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఇస్కాన్ విద్యా సంస్థ డివైన్ టచ్ పాఠశాల 14వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవాటు చేసుకుని నీతి, నిజాయితీగా జీవించాలన్నారు. క్యారెక్టర్ లేకపోతే ఎంత సంపాదించిన వృథానే అవుతుందన్నారు. భగవద్గీతలోని శ్లోకాలు అలవోకగా చదివి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. ప్రత్యేక అతిథిగా కెనడాకు చెందిన ఇస్కాన్ ప్రతినిధిగా విచ్చేసిన భక్తిమార్గ్ స్వామి మహరాజ్ విద్యార్థులకు హరే కృష్ణ మహామంత్రంతో ప్రసంగించి ఆశీస్సులను అందజేశారు. డివైన్ టచ్ పాఠశాల ప్రిన్సిపాల్ నేహాదాస్, ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేయగా, పాఠశాల ప్రతినిధి ప్రసన్న వందన సమర్పణ గావించారు.పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక అంశాలు అందరినీ అలరించాయి.

అలవోకగా భగవద్గీత శ్లోకాలు చదివి వినిపించి అబ్బురపరిచిన సీపీ


ఆశ వర్కర్లకు ఓరియంటేషన్ శిక్షణ


ఆశా వర్కర్లకు శిక్షణ అందిస్తున్న సిబ్బంది

ఆరిలోవ, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లాకు చెందిన ఆశా వర్కర్లకు విశాఖ జిల్లాలో గల పైనాపిల్‌కాలనీ గల మహిళా ప్రాంగణంలో 8 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మహిళా ప్రాంగణం మేనేజర్ విమల తెలిపారు. ఈ ఓరియెంటేషన్ శిక్షణలో ఉద్యోగానికి సంబంధించిన పలు శిక్షణ ఇస్తున్నట్టు ఆమె చెప్పారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో తమ విధులు మహిళలకు సంబంధించినవి ఏవిధంగా నిర్వహించాలి. ఏయే సమయాల్లో, ఏ టీకాలు చిన్నారులకు వేయాలి. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే అంశాలపై మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది శిక్షణ ఇస్తారని విమల తెలిపారు.

జ్ఞానోదయం నిరంతర ప్రక్రియ

కళాభారతిలో స్వామీ పరిపూర్ణానంద ప్రవచనాలు



ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న స్వామి పరిపూర్ణానంద

మద్దిలపాలెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతిలో శనివారం పూజ్యశ్రీ స్వామి పరిపూర్ణానంద ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. స్వామి వారు తొలిరోజు సాధన రహస్యం అంశంపై ప్రవచనాలు కొనసాగింది. ప్రతిరోజు సూర్యోదయం ఎలా జరుగుతుందో అదే విధంగా ప్రతిరోజూ మనకు జ్ఞానోదయం కలగాలని చెప్పారు. ఎప్పుడు విన్నదే అయినా ఎప్పటికప్పుడు కొత్తగా మార్గనిర్దేశం చేసే స్థాయి భగవద్గీతకు ఉందన్నారు. మానవత్వం నుంచి దైవత్వానికి సాగే ప్రయాణమే భగవద్గీత లక్ష్యమని వివరించారు. భగవద్గీతను బోధించే శ్రీకృష్ణుడు స్థాయి, అద్వైత సిద్ధాంతాన్ని బోధించిన ఆదిశంకరుల స్థాయి, ఉపదేశసారం అందించిన రమణ మహర్షి స్థాయి మహోన్నతమైవన్నారు. అటువంటి వారు సూచించిన ఆలోచన సరళి ఈనాడు ఎన్నో సమస్యలతో సతమతవుతున్న మనకు ఎలా సరిపడతాయో చెప్పడమే మూడు రోజుల ప్రవచనాల ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చైర్మన్ మంతెన సత్యనారాయణ, కార్యదర్శి రాంబాబు, ప్రసాద్, చిట్ట పంతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి..ముందే చేరండి

- ఆటోల్లోనే ఎక్కువమంది విద్యార్థులు ప్రయాణం
- సిగ్నల్స్, ట్రాఫిక్‌లో ఇరుక్కున్న విద్యార్థులు
- ఉరుకులు పరుగులతో కేంద్రాలకు చేరిక


ఆటోల కోసం వేచి ఉన్న విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : ఉదయం 9 గంటలు అంటే సాధరణ సమయం. రోజువారి కళాశాలలకు వెళ్లే సమయమే. కానీ శనివారం నుంచి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఉరుకులు పరుగులు పెటారు. ఆలస్యంగా బయలుదేరడం, ట్రాఫిక్‌లో ఇరుక్కుకోవడం వల్లే చివరి నిమిషంలో ప్రయాసపడుతూ పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని కేంద్రాల్లో ఆలస్యమైనా విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పరీక్ష హాల్లోకి అనుమతించారు. కేవలం ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఆలస్యమవడంతో అధికారులు మొదట తప్పుగా విడిచిపెట్టారు.

నగరంలో ట్రాఫిక్ సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటలకు విద్యాసంస్థలు, ఉద్యోగాలకు వెళ్లే ప్రయాణికులతో వాహనాలు రద్దీ తీవ్రంగా ఉంటుంది. సిగ్నల్ పాయింట్‌లు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలంటే ట్రాఫిక్ రద్దీలో నాలుగైదు సిగ్నల్ పాయింట్లు దాటాల్సి ఉంటుంది. అంటే పరీక్షా కేంద్రాలకు వెళ్లడానికి కనీసం 15 నుంచి 20 నిమిషాలైన పడుతుంది. దీనికి తోడు పరీక్షా కేంద్రాలేవి బస్టాప్‌లు, ఆటోస్టాండ్‌ల వద్దో లేవు. కేంద్రాలకు చేరాలంటే సొంత వాహనాలు వినియోగించే వారికి మినహా మిగతా విద్యార్థులు బస్సులు దిగి మూడు, నాలుడు వందల మీటర్ల దూరమైన నడవాల్సి ఉంటుంది. దీనికి ఒక అయిదు నిమిషాలైన పడుతుంది. ఆటోల్లో ప్రయాణిస్తే ఇదే పరిస్థితి. చార్జీల దృష్ట్యా విద్యార్థులు షేరింగ్ ఆటోలనే తప్ప బుకింగ్ చేసుకుని పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకునే నగదు వెచ్చించలేరు.

విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు వెళ్లాలంటే దాదాపు అరగంట సమయం వెచ్చించాలి. కనుక ఇళ్ల నుంచి 7.30 గంటలకే బయలుదేరాలి.

నిర్లక్ష్యం వీడాలి...

ఏడదంతా ఉదయం 8.30 గంటలకు తెరిచే జూనియర్ కళాశాలలకు విద్యార్థులు సమయానికే చేరుకుంటున్నారు. పరీక్షల రోజున మాత్రం ఆలస్యమవుతూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. విద్యార్థుల ధీమా, నిర్లక్ష్యమే ఇందుకు కారణం. చాలామంది పరీక్ష రోజున కూడా పాఠ్యాంశాలు రివిజన్ చేసుకుంటూ, ముఖ్య ప్రశ్నలు ఒకసారి చూసుకుందామని ఇంటి వద్దే కాలం గడిపేస్తున్నారు. మరికొంతమంది దగ్గరే కదా వెళ్లిపోవచ్చని కాలయాపన చేస్తున్నారు. ఇంటి వద్దే గడిపేస్తున్న ఒక్కో నిమిషం కాస్త పరీక్ష సమయానికి దగ్గరవుతుంది.

తీరా టైం చూసుకుని 'అమ్మో..' అంటూ పరీక్ష కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. బాషా పరీక్షలకు ఆలస్యమైనా విడిచిపెట్టిన అధికారులు, గ్రూపు పరీక్షలకు మాత్రం అనుమతించరు. అందుకే ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకుని వేగంగా కేంద్రాలకు చేరుకోవాలి. అరగంట ముందు వెళ్లిన వచ్చే సమస్యలు లేవు, ఆలస్యమైతే ఏడాదంతా చేసిన సాధన ఫలితం లేకుండా పోతోంది. విద్యార్థులూ ఈ విషయం గుర్తుంచుకోండి అంటున్నారు విద్యావేత్తలు.


పరీక్షకు వెళుతున్న విద్యార్థులు

క్షయపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని వాసవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు ఉదయశ్రీ, పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, హెల్త్ సెంటర్ సిబ్బంది పాఠశాల పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలో పలు స్లోగన్స్ నిర్వహించారు. క్షయవ్యాధి అంటువ్యాధి అని, రెండు వారాలపైగా దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నినదించారు. క్షయవ్యాధికి పూర్తిగా మందులు ఉచితంగా అందచేస్తారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్, వైద్య సిబ్బంది సత్యనారాయణ, తవిటమ్మ, రమణ, కమల, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

పాత వెంకోజీపాలెంలో ఎన్నికల కోలాహలం

శ్రీసీతారామ సేవా సంఘం కార్యవర్గ ఎన్నిక నేడు

వెంకోజీపాలెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాతవెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం 2025-26 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ మొదలైంది. సంఘంలో గవర కులస్థులు మాత్రమే పోటీ చేసే సంఘ కార్యవర్గం ఎన్నిక ఈ ఏడాది ఓటింగ్ జరుగనుంది. సంఘంలోని మొత్తం 124 ఓట్లు ఉండగా అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీపడుతున్నారు. ఈ ఎన్నికను ఆదివారం ఉదయం రామాలయం వద్ద నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి కర్రి నరేంద్ర కుమార్ తెలిపారు. తమ గ్రామంలో చాలా దశాబ్ధాల తరువాత ఓటింగ్ వేసి ఎన్నుకునే ప్రక్రియ జరుగుతుందని గ్రామస్థులంతా, తమ గ్రామంలోనూ ఇటువంటి ప్రక్రియ జరగడం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, ఓటర్లంతా నిర్ణీత సమయంలో వచ్చి తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలని ఎన్నికల అధికారి సూచించారు.

పైనాపిల్ కాలనీ వద్ద కారు ఢీకొని వృద్ధురాలి మృతి


సావిత్రి (ఫైల్‌ఫోటో)

ఆరిలోవ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీ సమీపంలో గల ఎస్ఎస్ఎన్ బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో గెడ్డం సావిత్రి (62) అక్కడికక్కడే మృతి చెందింది. కారు సింహాచలం వైపు నుంచి హనుమంతవాక వైపు వెళుతోంది. సావిత్రి ఎస్ఎస్ఎన్‌నగర్‌గల తన చెల్లిలి ఇంటికి వస్తుండగా, రోడ్డుదాటే క్రమంలో ప్రమాదానికి గురైంది. కారు అపకుండా వెల్లిపోగా, స్థానికుల ఫిర్యాదు మేరకు హనుమంతవాక జంక్షనులో మాటు వేసి కారు డ్రైవరును ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. ప్రమాదంలో మృతి చెందిన గెడ్డం సావిత్రికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిద్దరికీ వివాహమైంది. కేసును ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వాహనాలు అన్ని సెంటర్ రోడ్డులో రావడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.. ఈ సెంటర్‌రోడ్డు ఖాళీగా ఉండడంతో వాహనచోదకులు ఈ అతివేగంగా వాహనాలు నడుపుతుండడం కూడా ప్రమాదాలకు కారణం.

కిడ్నీ పేరిట మోసంలో కేజీహెచ్‌కు సంబంధం లేదు

- సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అవయవదానం కేవలం జీవన్‌దాన్ సంస్థ ద్వారా మాత్రమే జరుగుతుందని, ఈ విషయంలో నకిలీ వైద్యులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద స్పష్టం చేశారు. కేజీహెచ్ వైద్యుల పేరిట కిడ్నీ ఇస్తామంటూ రూ.లక్షల్లో దోచుకున్న ఘటనపై ఆయన స్పందించారు. ఈ ఘటనతో కేజీ హెచ్‌కు ఎటువంటి సంబంధం లేదని, ఇది బయట వ్యక్తులు చేసిన మోసమన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు ఎవరూ స్పం దించవద్దని సూచించారు. కేజీహెచ్‌కు సంబంధించిన ఏసమాచారమైనా కమాండ్ కంట్రోల్ కలెక్టర్ ఆఫీస్ హెల్ప్‌లైన్ నంబరు 0891- 2590100, 2590102లకు ఫోన్ చేయాలన్నారు. కేజీహెచ్ వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, క్లాస్4 ఉద్యోగులకు ఇందులో ప్రమేయం ఉండదన్నారు. కేజీహెచ్‌లో మెడికల్ బోర్డు అనుమతి ఉన్న వారికి మాత్రమే జీవన్‌దాన్ ద్వారా అవయవదానం జరుగుతుందన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ ప్రముఖులు


అప్పన్న సన్నిధిలో సినీ హీరోయిన్ అంజలి

సింహాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామివారిని శనివారం పలువులు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ స్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి ఆలయంలోనికి తీసుకువెళ్లారు. కప్పస్తంభం, స్వామివారి అంతరాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత వేదపండితుల ఆశీర్వచనాన్ని, స్వామివారి ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

స్వామి వారిని ప్రముఖ సినీ నటి అంజలి, దర్శకుడు వశిష్ఠ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఏయూ వీసీ రాజశేఖర్‌కు జ్ఞాపిక, స్వామి ప్రసాదం అందజేస్తున్న దేవస్థానం అధికారులు

ప్రత్యేక పరిశీలన గృహం నుంచి ఇంటర్ పరీక్షలకు ఇద్దరు బాలికలు

ఆరిలోవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వ్యాలీ స్కూలు సమీపంలో గల ప్రభుత్వ బాలకల ప్రత్యేక పరిశీలన గృహం నుంచి ఇద్దరు బాలికలు ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్టు పరిశీలన గృహం సూపరింటెండెంట్ సునీత తెలిపారు. ఒక విద్యార్థి రెగ్యులర్ విధానం, మరో విద్యార్థిని ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్టు ఆమె తెలిపారు. వీరిని ప్రత్యేక బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు పంపిస్తున్నట్టు ఆమె తెలిపారు. ప్రస్తుతానికి ఈ చిల్డ్రన్ హోంలో 48 మంది, పరిశీలన గృహంలో ఒకరు ఉన్నట్లు ఆమె తెలిపారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 46, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏడీసీ సామన్నారాయణ

జ్ఞానాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై ప్రజలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, యూసీడీ అధికారులు, ఆర్పీలు అవగాహన కల్పించాలని ఏడీసీ ఆర్.సోమన్నారాయణ సూచించారు. శనివారం 41వార్డు సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో జోన్-5 అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ పై ప్రజలనుంచి అభిప్రాయాలు తెలుసుకుని సంబంధిత యాప్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సమష్టిగా చేపట్టి జీవీఎంసీకి మెరుగైన ర్యాంకు వచ్చేలా కృషిచేయాలని కోరారు. జోనల్ కమిషనర్ బి.రాము, సహాయ వైద్యాధికారి సునీల్ కుమార్, ఏపీడీ పుణ్యవతి, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ నేత అరెస్టు దుర్మార్గం'

అల్లిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌జీ పాలిమర్స్ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని, క్షతగాత్రులకు సరైన వైద్యం అందించాలని కోరుతూ ఆందోళన చేపట్టిన కేసులో కోర్టుకు హాజరు కాలేదన్న నెపంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన తీరు అమానుషంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విమర్శించారు. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతున్న వారిని ఇలా అరెస్టు చూపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికాదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు.


బాపూ సేవా సంఘ సేవలు విస్తృతం



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సీతంపేట, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ గాయత్రి కళాశాల ఆవరణలో ని బా బాపూ సేవా సంఘం హాల్‌లో అధ్యక్షుడు అంతర్వేది అధ్యక్షతన సేవా సలహా మండలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కార్యదర్శి రమణి నివేదికను సమర్పించారు. సంఘ కార్యకలాపాలను విస్తృత పరచాలని, పేద బాలలు, తల్లులకు వైద్య శిబిరాలు, బ్లాక్ పెయింటింగ్ క్లాస్‌లు నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, నవర ప్రకాశరావు, చల్లా మహాలక్ష్మి, అవసరాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కామేశ్వరరావు, డాక్టర్ మురళి రావు, ఉషారెడ్డి, వాణి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు వైద్య సేవలు



పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బంది

మహారాణిపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీసు సిబ్బందికి శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం పోలీసు బ్యారెక్స్‌లోని పోలీసు కల్యాణ మండపంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అపోలో ఆసుపత్రి గైనికాలజీ, జనరల్ మెడిసిన్, క్యాన్సర్, ఆర్థోపెడిక్, డెంటల్, ఐ, డైటీషియన్ సంబంధించిన వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసు మహిళా విభాగంనుంచి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ హోం గార్డ్సు సుమారు 220కి వైద్య సేవలందించి పలు సూచనలిచ్చారు.

బీసీలకు నిధుల కేటాయింపుపై హర్షం

అక్కయ్యపాలెం, మార్చి1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47.456 కోట్లు కేటాయించడంపై టీడీపీ విశాఖ పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి దువ్వి కాశీప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. మధ్యతరగతి ప్రజలు, రైతుల జీవితాల్లో ఈ కేటాయింపులు వెలుగులు నింపుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బడ్జెట్ రూపకల్పన చేసిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మరింత అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

డాబాగార్డెన్స్‌లో అంతులేని ఆక్రమణలు

» డ్రైనేజీలపై దుకాణాలు

» ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారం



లలితాకాలనీలో రోడ్డు మధ్యలోనే నిలిపి ఉంచిన వాహనాలు

డాబాగార్డెన్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాబాగార్డెన్స్ ప్రాంతంలో అనేక వాణిజ్య సముదాయాలు.. వివిధ పాఠశాలలు, ప్రభుత్వకార్యాలయాలున్నాయి. నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో పాదచారులు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురై రోజురోజుకు మాయమవుతున్నాయి. వాటిపై కొందరు శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పాదచారులు నడిచేందుకు మార్గం లేకుండా పోతోంది. వాహన రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నా, ఆక్రమణదారులను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో యథాతథంగా వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైన, రోడ్డు పక్కనున్న కాలువలపై పదుల సంఖ్యలో బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. రంగాస్ట్రీట్, ఇన్‌కమ్‌టాక్స్ రోడ్డు, లలితాకాలనీ, శారదాస్ట్రీట్ రోడ్డులో ఈ పరిస్థితి నెలకొంది.

రహదారి ఆక్రమణ

లలితాకాలనీలోని రోడ్డు మధ్య వరకు ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రోజులోని చాలాసేపు పెద్ద లారీలను సైతం ఇక్కడే నిలిపేసి ఎంచక్కా మిగిలిన పనులు చేసుకుంటున్నారు. అల్పాహార విక్రయదారులు ఏకంగా చిన్నపాటి బండిని ఏర్పాటు చేసుకుని సందును సైతం ఆక్రమించేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం నుంచి సింగ్ హోటల్ జంక్షన్ వరకు, సెంటర్‌పాయింట్ జంక్షన్ నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు నిత్యం ట్రాఫిక్ జామ్.

కన్నెత్తి చూడని ట్రాఫిక్ పోలీసులు

డాబాగార్డెన్స్‌లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ముఖ్యమైన పనుల నిమిత్తం రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లలితకాలనీ, రంగా స్ట్రీట్, భానుస్ట్రీట్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించేందుకు ప్రయత్నిస్తుంటారు.

పట్టనట్టుగా జీవీఎంసీ అధికారులు

జీవీఎంసీ అధికారుల తీరు తమకు పట్టనట్టుగా ఉంటోందని విమర్శలు వినిపిస్తున్నాయి. రోజురోజుకు సమస్య జటిలమవుతున్నా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రంగాస్ట్రీట్ పెన్‌స్కూల్ వద్ద కాలువపై బడ్డీ

త్వరలో డ్రైవ్ చేపడతాం



రోడ్డుపైన బడ్డీలు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు. త్వరలోనే ట్రాఫిక్ అధికారులతో కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైవ్ చేపట్టి సమస్య పరిష్కరించాం.

-ఎం.మల్లయ్యనాయుడు, జోనల్ కమిషనర్

అపరాధ రుసుం విధిస్తున్నాం



ఆక్రమణదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. సంచార వాహనాల్లో పర్యవేక్షిస్తున్నాం. ఇటీవల కల్లుపాకలు ప్రాంతంలో సమస్య పరిష్కరించాం. ఇక్కడా చర్యలు తీసుకుంటాం. అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తాం.

-ఎం.శ్రీను, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ

రైలు ప్రయాణికుల భద్రతకు కృషిచేయాలి

» జీఆర్పీ డీఎస్పీ రామచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న జీఆర్పీ డీఎస్పీ రామచంద్రరావు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పనిచేసి రైలు ప్రయాణికుల భద్రతతోపాటు రైల్వే ఆస్తుల సంరక్షించాలని జీఆర్పీ డీఎస్పీ రామచంద్రరావు సూచించారు. రైలు ప్రయాణికుల భద్రతపై రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) అధికారుల సమన్వయ శనివారం రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ స్టేషన్లు, దొంగతనాలు జరిగే రైలు మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కీలక మార్గాలలో నడిచే రైళ్లలో విధులు నిర్వహించే జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి దొంగతనాలను నిరోధించాలని కోరారు. మహిళలు, దివ్యాంగుల కోచ్‌ల్లోకి ఇతరులు ప్రవేశించకుండా ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. ప్లాట్‌ఫామ్‌లపై 24 గంటలు గస్తీ కొనసాగించడంతోపాటు సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తూ అనుమానితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. దొంగతనాలు, స్నాచింగ్, మాదక ద్రవ్యాల రవాణా తదితర నేరాలపై స్టేషన్లలోని మాధ్యమాల ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. ప్రయాణికుల హెల్ప్ లైను నంబరు 139 లేదా రైల్ మదర్ పోర్టల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. జీర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది మధ్య రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, బొబ్బిలి, పార్వతీపురం, పలాస, అరకు, రాయగడ స్టేషన్లకు చెందిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. 44వ వార్డుకు చెందిన ఎం.గాయత్రికి రూ.20 వేలు, 47వ వార్డు కె.దేవికి రూ.25,600, వరుణ్ సందేశ్‌కి రూ.50 వేలు, 25వ వార్డుకు చెందిన బాబుకు రూ.66,700, జామి జయదీప్ సందన్‌కు రూ.2.5 లక్షలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ మోసంలో కేజీహెచ్‌కు సంబంధంలేదు

» సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అవయవదానం కేవలం జీవన్‌దాన్ సంస్థ ద్వారా మాత్రమే జరుగుతుందని, ఈ విషయంలో నకిలీ వైద్యులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద స్పష్టం చేశారు. కేజీహెచ్ వైద్యుల పేరిట కిడ్నీ ఇస్తామంటూ రూ.లక్షల్లో దోచుకున్న ఘటనపై ఆయన స్పందించారు. ఈ ఘటనతో కేజీహెచ్‌కు ఎటువంటి సంబంధం లేదని, ఇది బయట వ్యక్తులు చేసిన మోసమన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని సూచించారు. కేజీహెచ్‌కు సంబంధించిన ఏ సమాచారమైనా కమాండ్ కంట్రోల్ కలెక్టర్ ఆఫీస్ హెల్ప్‌లైన్ నంబరు 0891- 2590100, 2590102లకు ఫోన్ చేయాలన్నారు. కేజీహెచ్ వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, క్లాస్ 4 ఉద్యోగులకు ఇందులో ప్రమేయం ఉండదన్నారు. కేజీహెచ్‌లో మెడికల్ బోర్డు అనుమతి ఉన్న వారికి మాత్రమే జీవన్‌దాన్ ద్వారా అవయవదానం జరుగుతుందన్నారు.

అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లోని గురువాయిరప్పన్ శ్రీకృష్ణ మందిరం వద్దనున్న వేద ధర్మ రక్షణ హాలులో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో భూనీలా సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్నిశనివారం నిర్వహించారు. వైఖానస ఆగమ సంప్రదాయంలో పాణంగిపల్లి రంగనాథచార్య స్వామి బృందం వేదమంత్రాల మధ్య ఈ వేడుక నిర్వహించారు. శృతిలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.ప్రభాకర్ శారద దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించి కల్యాణ ఘట్టాలను చక్కగా వివరించారు. ఈ కల్యాణంలో పాల్గొన్న దంపతులను అర్చకులు ఆశీర్వచనాలందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీఏ ఆఫీస్ రోడ్డంటే హడల్

» వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు



ఆర్టీఏ కార్యాలయ దారిలో వాహనాలు

మాధవధార, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వ వార్డు మాధవధార ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లే రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయం, సచివాలయాలు, డిగ్రీ కాలేజీలున్నాయి. దీనికి తోడు వాటర్ పంప్ హౌస్‌కు నిత్యం రాకపోకలు సాగించే ట్యాంకర్లతో సమస్య నెలకొంటోంది. శనివారం ఈ రోడ్డులో గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ట్యాంకర్లు నీటిని నింపుకుని రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో పాన్‌షాపులతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. మాధవధార ఉడాకాలనీ ప్రాంతానికి ఇది ముఖద్వారం. క్రమేపీ వాణిజ్య కార్యకలాపాలకు అడ్డాగా మారింది. డిగ్రీ కాలేజీ విద్యార్థులు వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. జీవీఎంసీ కొత్త జోనల్ కార్యాలయం ఇక్కడి వాటర్ పంప్ హౌస్ పక్కనే రూపుదిద్దుకుంటోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థికి ప్రోత్సాహం అందిస్తున్న ప్రిన్సిపాల్ రమణ

కంచరపాలెం, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ప్రతిభ చూపిన నాలుగు బ్రాంచిల మెరిట్ విద్యార్థులకు రూ.1.30 లక్షల ప్రోత్సాహకాలను శనివారం అందజేశారు. శనివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల తొమ్మిదో వార్షికోత్సవంలో భాగంగా వారు సమకూర్చిన నగదు, మెడల్స్‌ను ప్రిన్సిపాల్స్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కెందోశ అధ్యక్షుడు కే వరహాలు, కో ఆర్డినేటర్ బీవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను వివరించి ప్రస్తుత విద్యార్థుల్లో ఉత్తేజం కల్పించారు.అనంతరం జనరల్ బాడీ ఎగ్జిక్యూటివ్ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. పీవీ రంగారావు కెందోసా గౌరవాధ్యక్షుడుగా, వైవీ తారక్‌ను సెక్రటరీ, ట్రెజరర్‌గా ఎ.సతీశ్, జాయింట్ ట్రెజరర్‌గా ఎన్.జానీ బాషా, ఉపాధ్యక్షుడిగా బీ గోవిందరావుతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభ్యులు రెండేళ్ల పాటు కళాశాల అభివృద్ధికి చేయూతనందించనున్నారు. విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వాడకం

... 5వ పేజీ తరువాయి

లక్షలు. ఈపీడీసీఎల్‌కనెక్షన్లు సుమారు 10,03,794 వరకూ ఉన్నాయి అందులో గృహాలతో పాటు పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, రహదారుల పక్కన దుకాణాలు ఉన్నాయి. కనెక్షన్లు, ఆ మేరకు విద్యుత్ డిమాండ్, లోడు ఏటా పెరుగుతున్నాయి. 2024 ఫిబ్రవరితో పోల్చుకుంటే ఈ ఏడాది అదనంగా 220 మి.యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది.

డిమాండ్‌కు తగినట్టుగా సరఫరా..

- శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖ సర్కిల్

పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, వాటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా చేస్తున్నాము. వేసవి ఇంకా ముందుంది. ఎంత అవసరమైనా కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం.

సిటీలో కో వర్కింగ్ స్పేస్

... 5వ పేజీ తరువాయి

కంపెనీ తీసుకుంటుంది. కొన్ని కంపెనీలు పది మంది, 15 లేదా 20 మందితో కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. వారంతా కూర్చునేందుకు కుర్చీలు, మీటింగ్ హాల్ మాత్రమే కావాలి. ఒక భవనంలో పది నుంచి 20 చిన్న కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. బెంగళూరు, హైదరాబాద్, ముంబై, నోయిడాల్లో కొద్దిపాటి స్పేస్ తీసుకుని కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలు ఎక్కువగా ఉంటాయని ఐటీ నిపుణుడొకరు తెలిపారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు దగా'



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

సీతంపేట, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన రూ.45 వేలు కోట్లు ఎస్సీలకు ఎస్సీలకు రూ.22 వేల కోట్లు ఎస్టీలకు కేటాయించాలన్నారు. దానికి విరుద్ధంగా ఎస్సీలకు రూ.10,900 కోట్లు, ఎస్టీలకు రూ.4,307 కోటుల కేటాయించి దగా చేశారన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 27 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో వాటి కోసం ఎలాంటి కేటాయింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్.రాజులు, జి.రాంబాబు, మధు, కిశోర్, ప్రసాద్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి ప్రకటించారు. నూతన చట్టం ప్రకారం ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చొనే వ్యక్తి (పలియన్ రైడర్) కూడా విధిగా హెల్మెట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. వాహనం నడిపే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోకపోతే ఇప్పటివరకు రూ.వెయ్యి జరిమానా విధించగా, ఇకపై కూడా రూ.వెయ్యి మాత్రమే విధిస్తారు. రెండోసారి పట్టుబడితే మాత్రం రూ.రెండు వేలు చెల్లించాల్సి ఉంటుంది. బైక్ వెనుక కూర్చొనే వ్యక్తి హెల్మెట్ పెట్టుకోనట్టయితే దానికి కూడా రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి అదే వ్యక్తి ఎక్కడైనా పట్టుబడితే మాత్రం రూ.రెండు వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు కట్టాల్సి ఉటుంది. 18 ఏళ్లలోపు వారు (మైనర్‌లు) వాహనం నడిపితే ఇప్పటివరకు రూ.500 జరిమానా విధించగా... ఇకపై రూ.ఐదు వేలకు పెంచారు. 18 ఏళ్లు దాటినా వేర్వేరు కారణాల చేత డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత లేనివారు వాహనం నడుపుతూ పట్టుబడితే ప్రస్తుతం విధిస్తున్న రూ.500 జరిమానాను రూ.పది వేలకు పెంచారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తుండగా, ఇకపై రూ.1,500 కట్టాల్సి ఉంటుంది. ఒకవేళ రెండోసారి పట్టుబడితే రూ.పది వేలు కట్టాల్సి ఉంటుంది. ఆటో డ్రైవర్లు యూనిఫారం లేకుండా పట్టుబడితే ఇంతవరకూ రూ.150 జరిమానా విధించగా, ఇకపై రూ.300 విధిస్తారు. అలాగే ఆటో ప్రయాణికుల నుంచి అదనపు చార్జీ డిమాండ్ చేస్తే వారికి రూ.750 జరిమానా విధించనున్నారు. వాహనాన్ని అపరిమితవేగంగా నడిపితే ప్రస్తుతం రూ.400 జరిమానా విధిస్తుండగా ఇకపై రూ.వెయ్యి విధించనున్నారు. ప్రమాదకరంగా వాహనం నడిపినవారికి ప్రస్తుతం రూ.వెయ్యి జరిమానా విధిస్తుండగా, ఇకపై రూ.1,500 విధించనున్నారు. రెండోసారి పట్టుబడితే రూ.పది వేలు కట్టాల్సి ఉంటుంది. బైక్ రేసింగ్‌లకు పాల్పడేవారికి ప్రస్తుతం విధిస్తున్న రూ..వెయ్యి జరిమానాను రూ.ఐదు వేలకు పెంచారు. రెండోసారి పట్టుబడితే వారికి రూ.పది వేలు జరిమానా విధిస్తారు. రవాణా వాహనాలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే ఇంతవరకు రూ.వెయ్యి జరిమానా చెల్లించగా, ఇకపై రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి అదనపు టన్నుకి రూ.రెండు వేలు చొప్పున అదనంగా చెల్లించాలి. 108తోపాటు ఇతర అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా ఆటంకం కలిగిసతే ఇకపై రూ.పది వేలు జరిమానా విధించనున్నారు. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే ఇంతవరకు రూ.వెయ్యి వసూలుచేయగా, ఇకపై రూ.రెండు వేలు కట్టాల్సి ఉంటుంది. రెండోసారి పట్టుబడితే రూ.4 వేలు జరిమానా చెల్లించాలి. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సిగ్నల్ జంపింగ్ చేయడం వంటి ఉల్లంఘనలకు ఇకపై రూ.వెయ్యి కాకుండా రూ.2వేల జరిమానా కింద వసూలు చేయనున్నారు.

ఆహారం... ఆరోగ్యం

... 5వ పేజీ తరువాయి

దోసెలు, కిచెడీ, ఉప్మా వంటివి తింటున్నారు.

భోజనంలో మార్పులు

గ్లైసెమిక్ ఇండెక్స్ అధికంగా ఉండడంతో చాలామంది వైట్ రైస్‌కు దూరంగా ఉంటున్నారు. వైట్ రైస్ స్థానంలో బ్రౌన్ రైస్, ఓట్స్ కొర్రలు, సామలు, అరికలతో తయారుచేసిన ఆహార పదార్థాలకు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే తెల్లని రైస్ పండిస్తున్నారు. తెల్లని రైస్‌కు అలవాటు పడినవాళ్లు వాటిని తెప్పించుకుని తింటున్నారు.

ఆరోగ్యానికి మేలు

చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి వాటితో చేసిన ఆహార పదార్థాలు బీపీ, థైరాయిడ్, ఊబకాయం, కంటి సమస్యలు, పీసీవోడీ, అండాశయం ఇబ్బందులు, డయాబెటిస్, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడే వారికి ఎంతగానో మేలు చేస్తాయని చెబుతున్నారు. షుగర్, ఊబకాయం వంటి సమస్యలకు గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడమే కారణంగా వైద్యులు చెబుతున్నారు. తృణధాన్యాల్లో జీఐ తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ వంటివి దరిచేరవని నిపుణులు చెబుతున్నారు. అలాగే, తృణధాన్యాల్లో అధికంగా ఉండే ప్రొటీన్లు కండరాల సామర్థ్యానికి దోహదం చేస్తాయి.

సేంద్రీయ పంటల వైపు మొగ్గు..

మరోవైపు రసాయనాలు వినియోగించకుండా పండించిన కూరగాయలు, పంటల వైపు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటి ధర కాస్త అధికంగా ఉన్నప్పటికీ వెనక్కి తగ్గడం లేదు. ఎంతో మంది మేడపైనే తమకు కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలను సేంద్రీయ పద్ధతుల్లో పండించుకుంటున్నారు. మరోవైపు మార్కెట్‌లో లభించే ఆయిల్ కంటే గానుగ నూనెలు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. దేశీవాళీ ఆవు పాలకు, నెయ్యికి కూడా డిమాండ్ పెరుగుతోంది.

ఆహారపు అలవాట్లలో మార్పులతోనే సమస్యలు

- డాక్టర్ ఆర్.వాసుదేవ్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు

అనేక అనారోగ్య సమస్యలకు ఆహారపు అలవాట్లే కారణం. కొంతమంది ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు జంక్ ఫుడ్, బయట ఫుడ్ తింటుంటారు. వారికి చిన్న వయసులోనే జీర్ణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో పూర్వ ఆహార పద్ధతుల వైపు చాలామంది వెళుతున్నారు. చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా షుగర్, బీపీ వంటి సమస్యలతో బాధపడే వారికి మిల్లెట్స్‌తో చేసిన ఆహారం కొంత మేలు చేస్తుంది. వైట్ రైస్‌లో కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి. దీనివల్ల షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. కాబట్టి, వీరంతా బ్రౌన్ రైస్, మిల్లెట్స్ చేసిన ఆహారాన్ని అలవాటు చేసుకుంటున్నారు.

బ్యాలెన్స్‌డ్ డైట్ అత్యంత కీలకం

-డాక్టర్ ఆర్.రేఖ, పోషకాహార నిపుణులు, ఏయూ

మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని కూడా పరిధి మేరకు తీసుకోవాలి. ఏవి తీసుకున్నా బ్యాలెన్స్ డైట్ అత్యంత కీలకం. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా విటమిన్లు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి. షుగర్, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మిల్లెట్స్‌తో చేసిన ఆహారం మంచిది. వీటి వినియోగం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

అంకితభావంతో పనిచేస్తా

... 5వ పేజీ తరువాయి

విజన్-2047కు వర్సిటీ కూడా తన వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు. ఎంతోమంది మహనీయుల స్ఫూర్తి, కృషి ఫలితంగా వర్సిటీ ఉన్నత స్థానంలో నిలిచిందని, దీనిని ముందుకు తీసుకువెళతామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగావిద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా కరిక్యులమ్‌కు రూపకల్పన చేస్తామన్నారు. కేంద్రీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ వనరులు, నిధులు పెంపొందించుకునేందుకు కృషిచేస్తామని వివరించారు. ఏఐ వంటి అధునాతనసాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ఉన్న వనరులతోనే అత్యుత్తమ ఫలితాలను అందించేందుకు కృషిచేస్తామని స్పష్టంచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే దిశగా నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నసీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీకి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా లీడర్ షిప్ అకాడమీలు, క్లబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇండస్ట్రీ, అకాడమీ మధ్య పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు అనుగుణంగా పరిశ్రమలకు చెందిన నిపుణుల సేవలను వినియోగించుకుంటామన్నారు. వర్సిటీలో ఫ్యాకల్టీ సమస్య ప్రధానంగా ఉందని, ప్రభుత్వ సహకారంతోఈ సమస్యను అధిగమిస్తామని స్పష్టంచేశారు.

మహనీయులకు నివాళులు

బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ముందుగా ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రెక్టార్ కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్ ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్లు, ఇతర అధికారులతో ఆయన అకడమిక్ సెనేట్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ ప్రక్రియకు ముందు ఎవరూ పూల బొకేలు, శాలువాలు, బహుమతులు తీసుకురావొద్దంటూ ముందుగానే సర్క్యులర్‌ను పంపించారు. అనంతరం సెనేట్ హాలులో వివిధ విభాగాల నుంచి వచ్చిన ఫ్యాకల్టీ, సిబ్బందితో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చాక్లెట్ ఇచ్చి వారి వివరాలను తెలుసుకున్నారు.



ఉక్కు డైరెక్టర్ దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కు ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ సమస్య పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ సమస్యను పరిష్కరించాలని కోరుతూ డైరెక్టర్ (పర్సనల్) కేసీ దాస్‌కు శనివారం టీఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎరియర్స్‌తో సహా హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, టౌన్‌షిప్‌వాసులకు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్లాంట్ ప్రగతి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, ప్లాంట్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, అధ్యక్షుడు గుమ్మడి నరేంద్ర, పెద్దాడ సోమినాయుడు ఉన్నారు.

చినజీయర్ స్వామికి ఆహ్వాన పత్రిక అందజేత



చినజీయర్ స్వామికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

వేపగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి 25వ వార్షిక బ్రహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామికి ఆహ్వాన పత్రికను శనివారం విమానాశ్రయంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు అందజేశారు. ఆదివారం నుంచి ఏడో తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీనివాసస్వామి, శ్రీను, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక మూలవిరాట్‌కు పవిత్ర జలాలతో స్నానమాచరించారు. అనంతరం స్వామిని శోభాయమానంగా అలంకరించి నక్షత్ర హారతులిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో వెంకటాద్రి మార్మోగింది.

సినిమా గైడ్

● **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 35 దొండకాయలు 36, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 26, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, గోరుచిక్కుడు 36, దేముడుచిక్కుడు 52, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200



86వ వార్డు ద్వారకాపురి కాలనీలో అధ్వానంగా ఉన్న పార్కు



71వ వార్డు వడ్లపూడిలో తుప్పుపట్టి పాడైపోయిన చిన్నారుల క్రీడా సామగ్రి



అస్తవ్యస్తంగా ఉన్న వుడా ఫేజ్-1లోని పార్కు

పార్కులిలా.. సేదదీరేదెలా?

పిచ్చిమొక్కలతో నిండాయని స్థానికుల ఆవేదన

తుప్పుపట్టి పాడైపోయిన చిన్నారుల క్రీడా సామగ్రి

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

కూర్మన్నపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని పలు పార్కులు అధ్వానంగా మారాయి. సాయంత్రం పూట సేదతీరేందుకు అనువుగా పార్కులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 71వ వార్డు పరిధి వడ్లపూడిలోని పార్కులు, 86 వార్డులో ద్వారకాపురి కాలనీ పార్కు, వుడా ఫేజ్-1 పార్కులు పస్తుతం అస్తవ్యస్తంగా మారాయి. ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు సేదతీరేందుకు కేటాయించిన పార్కులు అభివృద్ధికి నోచుకోక పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో పాములు బెడద అధికమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు తుప్పుపట్టి పాడైపోయాయి. కనీసం పార్కుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు కూడా అనువుగా లేవని పలువురు వృద్ధులు, మహిళలు వాపోతున్నారు. పార్కుల చుట్టూ ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయినా పట్టించుకునే నాథులే కరువయ్యారని విమర్శిస్తున్నారు. కాగా కొందను కొన్ని పార్కులను పశువుల స్థావరాలుగా వినియోగిస్తుండడంతో దుర్వాసన వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. పార్కులను అభివృద్ధి చేయవలసిందిగా పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కుల అభివృద్ధికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చైతన్య నగర్‌లో స్తంభించిన ట్రాఫిక్

ఇంటర్ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తరలిరావడంతో బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు



చైతన్య నగర్ రోడ్డులో నిలిచిన వాహనదారులు

గాజువాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక చైతన్యనగర్ శనివారం విద్యార్థులతో దిగ్బంధించబడింది. చైతన్యనగర్‌లోని అన్ని మార్గాలు విద్యార్థులతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనం సరికదా.. కనీసం పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో చైతన్యనగర్‌లో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు రెండువేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రాగా, వారి వెంట తల్లిదండ్రులు కూడా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలో రావడంతో ఈ మార్గం కిక్కిరిసిపోయింది. దీంతో గాజువాక జాతీయ రహదారికి, కణితి రోడ్డుకు మధ్యలో వాహనాల రాకపోకలు స్తంభించిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పరీక్షల సమయంలో ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో పాఠశాలలు కూడా ఉండడంతో విద్యార్థులు తమ స్కూళ్లకు వెళ్లేందుకు నానాపాట్లు పడ్డారు. శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది.



కూర్మన్నపాలెంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

గాజువాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గాజువాక పరిధిలోని 11 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు తల్లిదండ్రులతో సహా చేరుకున్నారు. పరీక్ష ముగిసేంత వరకు తల్లిదండ్రులు ఆయా పరీక్ష కేంద్రాల పరిసరాల్లోనే ఉన్నారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం నారాయణ కళాశాలలో 481 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 475 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచే సందడి వాతావరణం నెలకొంది. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలో ఉన్న ఆలయాలకు తీసుకువెళ్లి పూజలు చేశాక పరీక్ష కేంద్రాలకు వచ్చారు. అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని అధికారులు ప్రకటించడంతో చాలామంది ఉదయం ఎనిమిది గంటలకే చేరుకున్నారు. పలు కేంద్రాలలో ఎనిమిదిన్నరకు లోపలకు అనుమతించారు.

పెందుర్తి: ఇక్కడి ఆర్ఆర్‌వీ పురంలోని ఆళ్వార్‌దాస్, శ్రీచైతన్య, పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనవోదయ, బాలాజీ, రాజయ్యపేట డీఆర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు 2,544 మంది విద్యార్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులను బాగానే సమకూర్చారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు రావడంతో ఆయా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పెందుర్తి ఇంటర్ జూనియర్ కళాశాలలో 490 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 29 మంది గైర్హాజరయ్యారు.

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభం కావడంతో బుచ్చిరాజుపాలెం, ఎన్ఏడీ పరిసరాల్లో గల గాయత్రి కాలేజీ, ఎసెంట్, చైతన్య, నారాయణ, ఎస్ఆర్ కలేజీ, గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపం ఆర్ఆర్‌వీపురంలోని ఎస్‌వీఎల్ఎన్ కళాశాలల వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆయా కేంద్రాలకు ఉదయం ఎనిమిది గంటలకు చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం, పెందుర్తి పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.

మహిళల సవాళ్లు, హక్కులపై అవగాహన



న్యాయవాదులు మాధురి, మోహన్‌రావును సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

అగనంపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ, ఎంసీఏ విభాగం మహిళా సాధికారత పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహిళల సవాళ్లు, వారి హక్కులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదులు మోహన్‌రావు, ఎంఎస్‌సీ మాధురి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల హక్కులు, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులపై విలువైన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, కో-ఆర్డినేటర్ జి.మణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గోపాలపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తపాలెం సంతోష్‌నగర్ కాలనీలోని సంఘం సామాజిక భవనం వద్ద ఆది వారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. రక్తదానం చేయాలనే యువతీయువకులు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా సంఘ ప్రతినిధులు కోరారు.

స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యానికి వేలం

గాజువాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లై అధికారులు ఆ బియ్యానికి శనివారం గాజువాకలో వేలం వేసి విక్రయించారు. గతంలో పలుచోట్ల దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 16 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం నిర్వహించిన వేలంలో కిలో బియ్యం రూ.26-50పైసలకు నర్సీపట్నానికి చెందిన ఓ వ్యాపారి పాడుకున్నారు. ఇందుకు సంబంధించిన మొత్తం నగదు చెల్లింపు జరిగాక అధికారులు బియ్యాన్ని సదరు వ్యాపారికి అందజేయనున్నారు.

బార్‌లలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



గోపాలపట్నంలోని ఓ బార్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు గోపాలపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బార్‌లలో సీఐ బి.చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా బార్‌లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి మద్యం నిల్వలతో సరిపోల్చారు. అదే విధంగా బార్‌లకు సమయపాలన పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సమయపాలన పాటించకుండా బార్లను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఎం.మోహనరావు, వీఎల్ కరుణలత, హెచ్‌సీలు సత్యం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సేతు ధ్యానం అత్యున్నతమైనది

పెందుర్తి-రూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సేతు ధ్యానం అత్యున్నతమైన సాధనమని సేతు విద్యా బోధకులు జి.బాలకృష్ణ పేర్కొన్నారు. 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బ్రహ్మర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సేతు విద్యా తరగతుల వర్క్‌షాపును శనివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న ధ్యాన విద్యను ఇతరులకు బోధించాలని సూచించారు. ప్రతికూల విమర్శలు చేసేవారిని విశ్వసించకుండా విస్మరించాలన్నారు. ఇందులో భాగంగా ధ్యానులు సామూహిక ధ్యాన సాధన చేశారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పి.ఈశ్వరమ్మ, సునీత బాలకృష్ణ, జ్యోతి, అనూరాధ, కామేశ్వరరావు, సతీశ్, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూలోకమాంబ పరస



వేపగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో ఆదివారం భూలోకమాంబ పరసను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేకువజామున పసుపునీళ్లతో ఉత్సవమూర్తికి అభిషేకాలు, షోడశోపచార, అష్టోత్తర శతనామావళి, తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సాయంత్రం పరసలో పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

కుంచుమాంబ, దుర్గమాంబకు పంచామృతాభిషేకం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవతలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్లకు శనివారం నవ్యాంధ్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకించాక పసుపుకుంకుమలు సమర్పించి పూజలు జరిపారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం



కేఎస్ పాలెం రామాలయం వద్ద..

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని కేఎస్ పాలెం రామాలయం వద్ద గల హైమాస్ట్ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతు న్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గత కొంతకాలంగా వెలగడం లేదు. స్తంభం పైభాగం తుప్పుపట్టి ఉండడంతో ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడి స్తంభాన్ని తొలగించాలని అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.



జోనల్ కార్యాలయంలో పన్ను చెల్లింపుదారులతో కిటకిటలాడుతున్న కౌంటర్

జోరుగా జీవీఎంసీ పన్నుల చెల్లింపులు

గాజువాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపుదారులతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయ కౌంటర్ శనివారం కిటకిటలాడింది. ఆస్తి, నీటి పన్ను చెల్లించేందుకు ప్రజలు శనివారం గాజువాక జోనల్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆస్తి పన్ను చెల్లించాలని జోనల్ రెవెన్యూ అధికారులు అసెస్‌మెంట్‌దారులకు నోటీసులు జారీ చేస్తుండడంతో ప్రజలు పన్ను చెల్లించేందుకు జోనల్ కార్యాలయానికి వస్తున్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి

పెదగంట్యాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64,65 వార్డుల పరిధిలోని పలు కాలనీల ప్రజలు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని స్టాక్ యార్డులు, పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. పెదగంట్యాడ పారిశ్రామికవాడలోని స్టాక్ యార్డులో గుట్టలుగా ఉన్న కోక్, ఇతర మెటీరియల్స్‌పై పరదాలు, టార్పాలిన్లను ఏర్పాటు చేయకపోవడం, వాటి లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, రవాణా సమయంలో లారీలపై టార్పాలిన్లను వేయకపోవడం వల్ల ధూళి ఎగిరి గాలిలో కలిసి కాలనీల వైపు వస్తుంది. దీంతో ఇళ్లల్లోకి, డాబాలపైన కాలుష్యం పేరుకుపో తుంది. తాగునీటి నిల్వలపైనా బొగ్గు ధూళి కణాలు తేలియాడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫిబ్రవరి నుంచి ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డు యజమానులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదని, అందువల్ల కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని టీడీపీ స్థానిక నాయకుడు సంపంగి సూరిబాబు కోరారు.

ఉపవాస దీక్ష... నియమాల రక్ష



నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

- ఉపవాసాలు, ప్రత్యేక నమాజులు ఆచరించనున్న ముస్లింలు
- దానధర్మాలు, సత్కార్యాలకు ప్రాధాన్యమిచ్చిన ఖురాన్

గోపాలపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): **ముస్లింలు పవిత్రంగా భావించి ఉపవాసాలు ఆచరించే రంజాన్ నెల ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో వచ్చే తొమ్మిదో నెల పేరు రంజాన్. ముస్లింల పవిత్ర దైవదత్త గ్రంథం దివ్య ఖురాన్ భూ మండలంపై అవతరించినట్టు ఖురాన్‌లో పేర్కొనబడింది. అందువలనే ఈ నెలకు ఇస్లాం ధర్మంలో అంత ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో 30 రోజుల పాటు దైవాజ్ఞతో ప్రపంచంలోని ముస్లింలందరూ ఉపవాస దీక్షలను ఆచరిస్తారు.**

యుక్త వయసు కలిగి, అనారోగ్య సమస్య లేని ప్రతి ముస్లిం స్త్రీ, పురుషులు ఉపవాసాలు ఆచరించడం విధి. అనారోగ్యంతో ఉన్న వారు, గర్భిణులు, ప్రయాణికులకు మినహాయింపు ఉంటుంది. రుతుస్రావ సమయంలో స్త్రీలు ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. వీరు తమ సౌలభ్యాన్ని బట్టి ఇతర నెలల్లో దీక్షలు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఎటువంటి కారణం లేకుండా పరిపూర్ణమైన ఆరోగ్యం కలిగి ఉవవాసం చేయకపోవడం మహాపాపంగా ఖురాన్ పరిగణిస్తుంది.

నేటి నుంచి ప్రారంభం

రంజాన్ నెలలో ఆచరించే ఉపవాసాల్ని ఉర్దూలో రోజా అని అరబిక్ భాషలో సౌమ్ అంటారు. రంజాన్ నెల ముందు వచ్చే షాబాన్. ఈ నెల ముగిసిన తరువాత వచ్చే నెలవంకను చూసినప్పటి నుంచి రంజాన్ నెల ప్రారంభమైనట్లే. రంజాన్ నెలవంక చూసిన మరుసటి రోజు ఉదయం నుంచి ఉపవాస దీక్ష ప్రారంభమవుతుంది.

ఇవీ ఆహార నియమాలు


ఉపవాసం ఉండే వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో దైవ ప్రవక్త ముహ్మద్ (సఅస) ఒక పద్ధతిని బోధించారు. సూర్యోదయానికి ముందే ఆహారాన్ని తీసుకోవాలి. దీనిని సెహర్ అని అంటారు. సాయంత్రం సూర్యాస్తమయం వరకూ ఎటువంటి అన్నపానీయాలు స్వీకరించకూడదు. సూర్యాస్తమయం తరువాత ఆహారాన్ని తీసుకుని ఉపవాస దీక్ష ముగిస్తారు. ఉపవాస దీక్షను ముగించే సమయంలో తీసుకునే ఆహారాన్ని ఇఫ్తార్ అంటారు. ఉపవాసాలు చేసేవారు తినే ఆహార పదార్థాలపైన ఎటువంటి ఆంక్షలు లేవు. ధర్మ సమ్మతమైన అన్నింటినీ భుజించవచ్చు. వడ్డీ ద్వారా లేదా అక్రమార్జన ద్వారా సంక్రమించి ఆహారం తీసుకుంటే వారి ఉపవాసాలు అంగీకరించరని ప్రవక్త ప్రవచనం. ఉపవాసం చేసేవారు మితంగా అంటే దైవారాధనకు ఇబ్బంది కలగకుండా శరీరానికి కావల్సిన శక్తిని సమకూర్చేంత ఆహారం మాత్రమే తీసుకోవడం ప్రవక్త విధానం.

దైవ విధేయత

సన్మార్గం కోసమే ఉపవాసాలు. దైవాజ్ఞ ప్రకారం ఉపవాసం ఆచరించి దైవ ప్రసన్నత పొంది జీవితాన్ని సరైనమార్గంలో నడిచే విధానం అలవర్చుకోవడానికి ఏడాదిలో నెల రోజులు ఆచరించే ఉపవాసాలు ఓ శిక్షణా కాలంగా చెప్పవచ్చు. ధర్మ సమ్మతమైన ఎన్నో అవసరాలను దేవుని ప్రసన్నత కోసం విడిచిపెట్టి, కామక్రోధాలను, మనస్సును అదుపాజ్ఞల్లో ఉంచుకుని మనోకాంక్షలను జయించడం ఉపవాస సమయంలో చేయాల్సిన ముఖ్యమైన పని. కేవలం ఆకలి దప్పికలతో ఉండడం ఉపవాసం కాదు. చెడునడత నుంచి దూరంగా ఉండడం, అశ్లీలత, అబద్ధాలు, చాడీలు చెప్పడం, కొట్లాటకు వెళ్లడం వంటి సమస్త దుష్కార్యాల నుంచి దూరంగా ఉండి ప్రతి పాపకార్యం నుంచి శరీర అవయవాల్ని రక్షించుకుని దైవ ప్రసన్నత పొందడం కోసం చేసేదే నిజమైన ఉపావాస దీక్ష. ఉనవాసం చేసేవారు సినిమాలు, టీవీలు వీక్షించి సమయం వృథా చేయడం నిషేధం.

నెలవంక దర్శనం వరకు

రంజాన్ నెల ప్రారంభంలో కనిపించే నెలవంకను చూసిన తరువాత రోజు నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమైతే నెలాఖరులో నెలవంకను చూసిన తరువాత ఉపవాస దీక్షలు ముగుస్తాయి. అంటే సరిగ్గా 30 రోజుల పాటు దీక్షలు ముగిసిన తరువాత రంజాన్ పండగ జరుపుకోవాలి. చాలా అరుదుగా 29 రోజులకు నెలవంక కనిపిస్తుంది. కొన్ని సమయాల్లో వర్షాలు కురవడం, ఆకాశం మేఘావృతమై నెలవంక దర్శనం జరగని సమాయాల్లో పూర్తిగా 30 రోజులు ఉపవాసాలు చేసి పండగ చేసుకోవాలి.



ప్రత్యేక ప్రార్థనలు

నెలవంకను చూసిన రాత్రి నుంచి మళ్లీ నెలాఖరులో నెలవంకను చూసే వరకూ ప్రతి రోజు రాత్రి ప్రత్యేక నమాజులు ఉంటాయి. సాధారణంగా రోజుకు 5 వేళల్లో ఆచరించే నమాజులతో పాటు రంజాన్ నెలలో ప్రత్యేకం గా ఆచరించే నమాజును తరావీ నమాజ్ అంటారు. ఉపవాసదీక్షతో సంబంధం లేకుండా ప్రతి ముస్లిం ఈ నమాజులను ఆచరించడం ప్రవక్త సంప్రదాయం. ఈ నెలరోజుల పాటు ఈ నమాజుల్లో ఖురాన్ గ్రంథ సంపూర్ణ పారాయణం చేస్తారు.



సింహాచలం ఈవోగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

సింహాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సింహాచల దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కె.సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈవోగా ఉన్న వి.త్రినాథరావు సెలవు పెట్టడంతో రాజమహేంద్రవరం డిప్యూటీ కలెక్టర్ సుబ్బారావుకు మూడు నెలలు ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు త్రినాథరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. సుబ్బారావుకు డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజులు స్వాగతం పలికారు. సింహాచలేశుని దర్శనానంతరం శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు.

అమల్లోకి సవరించిన రైళ్ల నంబర్లు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సవరించిన రైళ్ల నంబర్లు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల ఒకటి నుంచి 18515 నంబరుతో తిరుగు ప్రయాణంలో 18516 నంబరుతో నడుస్తుందన్నారు.భువనేశ్వర్-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ ఈనెల ఏడు నుంచి 20849 నంబరుతో తిరుగు ప్రయాణంలో 20850 నంబరుతో, భువనేశ్వర్-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈనెల నాలుగు నుంచి 20851 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 20852 నంబరుతో, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల ఆరు నుంచి 20853 నంబరుతో, తిరుగు ప్రయాణంలో 20854 నంబరుతో నడుస్తాయన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



విద్యార్థినిని తనిఖీ చేస్తున్న దృశ్యం

జిల్లాలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 వరకు మొదటి సంవత్సరం పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పరీక్షకు ముందు సంపత్‌వినాయగర్‌కు పూజలు చేస్తున్న ఇంటర్ విద్యార్థులు



కృష్ణా కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



బుల్లయ్య కళాశాలలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కూటమి ప్రభుత్వానిది మేధావుల బడ్జెట్

- విశాఖ పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఫ్యాక్షనిస్టులు బడ్జెట్ ప్రవేశపెడితే కూటమి ప్రభుత్వంలో మేధావులు ప్రవేశపెట్టారని తెలుగుదేశం విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ వ్యాఖ్యానించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేకూర్చనున్నదన్నారు. ఉమ్మడి జిల్లాకు రూ.1,400 కోట్లు కేటాయించారన్నారు. వచ్చే ఏడాది చివరికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలన్న సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చే ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. బడ్జెట్‌పై వైసీపీ నేత అమర్‌నాథ్‌కు అవగాహన లేదని, వైసీపీ ఐదేళ్లలో నీటి వనరులను నిర్లక్ష్యంచేసినా అమర్ ప్రశ్నించలేదన్నారు. విశాఖ మెట్రో పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, భూసేకరణకు అవసరమైన సర్వే చేస్తున్నారని బాబ్జీ పేర్కొన్నారు. సమావేశంలో నేతలు వెల్లంకి భరత్, గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్నివర్గాలకు వంచన

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాలను వంచించారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో అప్పులు గురించి చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అమరావతికే రూ.ఆరు వేల కోట్లు కేటాయించారని, ఉత్తరాంధ్ర, రాయలసీమకు అన్యాయం చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో భాగమైన ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర నిధులతో అమలుపై అనుమానాలున్నాయన్నారు. బడ్జెట్ కార్యక్రమాన్ని లోకేశ్‌ను పొగిడే కార్యక్రమంగా మార్చేశారని విమర్శించారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి ప్రాణహాని

- ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

సిరిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి):ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి ప్రాణహాని ఉందని, ఏదైనా కీడు జరిగితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధ్యత వహించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ వ్యాఖ్యానించారు. శనివారంకేఏ పాల్ ఫంక్షన్ హాలులో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్స్ స్కీ మధ్య వైట్‌హౌస్‌లో జరిగిన వివాదంతెలిసేందనన్నారు. జరిగిన సంఘటనపై జెలన్స్ స్కీకి ట్రంప్ వెంటనే క్షమాపణ చెపాల్పన్నారు. 1994లో రష్యా.. ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఇచ్చిన మాట ఎక్కడ నిలబెట్టుకుందని నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే తనతో మిత్రత్వం ఉన్న అమెరికా నేతలు ఉక్రెయిన్‌కు మద్ధతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ వివాదం ఇక్కడితో ఆగకపోతే ప్రపంచ యుద్ధం మొదలయ్యేది రష్యాతో కాదని చైనా మొదలు పెడుతుందని వ్యాఖ్యానించారు. తైవాన్, హాకాంగ్‌లను చైనా ఆక్రమించుకోవడం మొదలు పెడుతుందన్నారు. రష్యా, ఉక్రెయిన్‌లు చేసిన తప్పులేంటో బేరీజు వేసుకోవాలన్నారు. శాంతి సాధకులు మెలగి సమస్యను ఒక కొలిక్కి తీసుకురావడం అవసరమన్నారు. త్వరలోనే అమెరికాకు తాను వెళ్తున్నానని సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మహిళ కడుపులో పది కిలోల కణితి తొలగింపు





శస్త్ర చికిత్సచేసిన కేజీహెచ్ వైద్యులు, (ఇన్‌సెట్‌లో) తొలగించిన కణితి

మహారాణిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ గైనికాలజీ వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మహిళ కడుపులోనున్న పది కిలోల కణితిని తొలగించారు. వివరాలివి.. నగరానికి చెందిన వివాహిత (33) కడుపు నొప్పితో బాధపడుతూ గత నెల ఏడోతేదీన తేదీన కేజీహెచ్ ఓపీకి వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆమె కడుపులో గడ్డ పెరుగుతున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో గైనికాలజీ వార్డులో చేర్చుకుని పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 34 వారాల పరిమాణంలో పది కిలోల కణితి ఉన్నట్టు అంచనావేశారు. ఫిబ్రవరి 18న శస్త్ర చికిత్స చేసి, కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ చేసిన వైద్యులు రాజ్యలక్ష్మి, సృజన, లీలామాధురి, అనూష, నళిని, ఎవాంజెలిన్, లక్షిత, మాధురి, హేమలత, యోగిత, విజయలను సూపరింటెండెంట్ శివానంద అభినందించారు.

‘సాహితీ ఫార్మా’ ప్రమాద కారణాలపై స్పష్టత శూన్యం

- బయటకు వచ్చిన నివేదిక
- పునరావృతం కాకుండా సూచనలు లేవు
- విభేదించిన ప్రజా శాస్త్రవేత్తల బృందం

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలో 20 నెలల క్రితం సాహితీ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై కమిటీ ఇచ్చిన నివేదిక ఎట్టకేలకు బయటకు వచ్చింది. 2023 జూన్ నెలలో రీబాయిలర్ పేలి పది రోజుల వ్యవధిలో ఆరుగురు కార్మికులు చనిపోయారు. దీనిపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు సరైన నష్టపరిహారం ఇవ్వలేదని ప్రజా శాస్త్రవేత్తల బృందం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించింది. ఫార్మా కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని తీసుకోవడం లేదని, అందువల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని పిటిషన్ వేసింది. ఇదిలావుండగా ప్రమాదంపై జిల్లా అధికారులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బయటపెట్టలేదు. విశాఖ జిల్లాలోని మానవ హక్కుల వేదిక పదే పదే సమాచార హక్కు చట్టం కింద కోరడంతో పది పేజీల నివేదికను ఫిబ్రవరి 28న పోస్టులో పంపించారని శాస్త్రవేత బాబూరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.

పది పేజీల నివేదిక రాయడానికి కమిటీ 20 నెలల సమయం తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ నివేదికలో కూడా ప్రమాదం జరగడానికి కారణాలు వెల్లడించలేదని, ఎందుకు జరిగింది?, ఎలా జరిగిందో?...విశ్లేషణ లేదని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదం జరగకుండా ఏమి చేయాలో కూడా సూచనలు చేయలేదని విచారం వ్యక్తంచేశారు.

ఆరు టన్నుల బరువు కలిగిన ట్యాంకు 70 మీటర్ల దూరం వెళ్లి పడిందని, అంత శక్తి మంటల వల్ల రాదని, విస్ఫోటనంతో సాధ్యమని, అది ఎలా జరిగిందో కమిటీ వెల్లడించలేదని ఆరోపించారు. ఎన్‌జీటీలో కేసు నడుస్తున్నప్పుడు ఈ నివేదిక బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారని, కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యాలకే కాకుండా అధికారులకు కూడా బాధ్యత కరువైందని, అటువంటి కమిటీల వల్ల ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

క్రైం... crime news

జంతు ప్రదర్శనశాలలో సింహం పిల్ల మృతి

- గోప్యత పాటిస్తున్న జూ అధికారులు

ఆరిలోవ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సింహం రెండు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని జూ అధికారులు గోప్యంగా ఉంచారు. ఎవరికీ తెలయనీయలేదు. అయితే అందులో ఒకటి ఇటీవల మృతి చెందినట్టు తెలిసింది. ఈ విషయాన్ని కూడా జూ అధికారులు ప్రకటించలేదు. జూలో రెండు సింహం పిల్లలు పుట్టిన విషయమై కొన్ని రోజుల కిందట ‘ఆంధ్రజ్యోతి’లో కథనం ప్రచురితమైంది. అయితే జూ అధికారులు కొన్నిరోజుల తర్వాత సింహం పిల్లల ఫోటోలను చూపిస్తామంటూ ఇన్ని రోజులూ చెప్పారు. శనివారం.. జూ క్యూరేటర్ మంగమ్మను అడగ్గా.. సింహానికి రెండు కూనలు పుట్టిన విషయం నిజమేనని ప్రస్తుతానికి ఒక కూన మాత్రమే ఉందని చెప్పారు. గత నెల 27న ఒక పిల్ల మృతి చెందినట్టు తెలిసింది. ఈ విషయాలను గుప్తంగా ఉంచాల్సిన అవసరం ఏముందని జూ అధికారులను ప్రశ్నించగా.. ఆ రెండు సింహం పిల్లలు ఇంకా కళ్లు తెరవలేదని, అవి కళ్లు తెరచిన వెంటనే వాటి ఫోటోలను విడుదల చేద్దామని భావించామని తెలిపారు. 1972లో జూ పార్కు ప్రారంభమైనప్పటి నుంచి సింహాలకు సంతానోత్పత్తి జరగలేదు. కొన్ని రోజుల కిందట రెండు సింహం పిల్లలు పుట్టాయి. అందులో ఒకటి మృతి చెందింది. ఈ విషయాలేవీ జూ అధికారులు అధికారికంగా ప్రకటించలేదు.

సోదరుల మృతిని తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

కంచరపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చిన్నాన్న కుమారులు ఇద్దరు సముద్రంలో గల్లంతై మృతిచెందడాన్ని తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివి... జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-5లో ఉంటున్న మొక్క సంపత్‌సాయి (26) బీటెక్ పూర్తిచేశాడు. తన చిన్నాన్న కుమారులు ఇద్దరు ఇటీవల రాంబిల్లి దగ్గర బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతై మృత్యువాత పడడంతో మానసికంగా కృంగిపోయాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.చేతికందివచ్చిన కుమారుడు ఇలా అర్థంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

- సీతంపేటలోని సెంటర్‌పై కేసు నమోదు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు యువతులతోపాటు ముగ్గురు విటులను అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని రిలయన్స్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న భవనం రెండో అంతస్తులో నీఏ లగ్జరీథాయ్ స్పా పేరుతో ఒక మసాజ్ సెంటర్ ఉంది. అందులో మసాజ్‌పేరుతో వ్యభిచారం జరుగుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి శనివారం దాడిచేయగా, ముగ్గురు యువతులతోపాటు నలుగురు విటులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వ్యభిచారం జరుగుతున్నట్టు అంగీకరించడంతో నిందితులను ద్వారకా పోలీసులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

శిశు మార్పిడి ఘటనలో కేజీహెచ్ సిబ్బందిపై చర్యలు

మహారాణిపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో జరిగిన శిశు మార్పిడి ఘటనలో ఏడుగురు అధికారులకు వేసిన కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. పిల్లల మార్పిడి ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలపై కమిటీని నియమించామన్నారు. ఈ మేరకు థియేటర్ అసిస్టెంట్ డి.రమను సస్పెండ్ చేయడంతో పాటు ఆ సమయంలో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులకు మెమోలు జారీ చేశామన్నారు. అస్పత్రిలోని అన్ని ఆపరేషన్ థియేటర్ల అసిస్టెటంట్లుచ నాల్గో తరగతి ఉద్యోగులు, స్టాఫ్ నర్సులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

10 నుంచి అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాలు

పద్మనాభం మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 10న నిర్వహించడానికి దేవాలయ కమిటీ నిర్ణయించింది. శనివారం స్థానిక కుంతీమాధవస్వామి దేవాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.10న కల్యాణం, 12న తెప్పోత్సవం, 13న రథోత్సవం, 14న డోలోత్సవం, 15న పుష్పయాగం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ఈవో నన్నాజీబాబు, ఎంపీపీ రాంబాబు, టీడీపీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్నాయుడు పద్దు, పైడిరాజు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.